నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
శుక్రవారం | మార్చి 14, 2025 | www.navatelangana.com

15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక


ప్రజావేదికలో పాల్గొన్న అధికారులు

నవతెలంగాణ-గాంధారి
మండల కార్యాలయం ఆవరణలో ఉపాధి హామీకి సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను జిల్లా డీఆర్‌డీఏ పీడీ సురేందర్ ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 01.04.2023 నుంచి 31.03.2024 వరకు మొత్తం జరిగిన పనుల వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో యుసి రాఘవన్, ఎస్‌టియం గోపి, ఎస్ఆర్‌పి మహేష్, ఎంపిడిఓ రాజేశ్వర్, ఎంపీఓ లక్ష్మి నారాయణ, ఏపీవో శతి, ఈసీ గణేష్, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్ ద్వారా కాలనీవాసులకు నీరు



నవతెలంగాణ-రెంజల్
మండలంలోని సాటాపూర్ గ్రామంలోని వడ్డెర కాలనీలో నీటి సమస్య తలెత్తడంతో గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ దగ్గరుండి ప్రజలకు తాగునీటిని అందించారు. ఈ కాలనీలోని బోరు మోటర్ చెడిపోవటంతో దానిని మరమ్మతులు చేపడుతూనే ప్రజలకు తాగునీటిని అందించడానికి ట్యాంకర్‌ను పంపించారు. హెూలీ పండుగ సందర్భంగా ప్రజలకు నీటి అవసరం తెలుసుకుని గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా వారికి నీటిని అందించినట్లు ఆయన పేర్కొన్నారు. త్వరలోనే బోరుమోటర్ మరమ్మతులు జరిపించి వారికి తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

నేడు 'పిడి గుద్దులాట'

ఆడొద్దని గ్రామస్తులకు పోలీసుల నోటీసులు

- ఆటకు 'సై' అంటున్న గ్రామస్తులు
- ప్రాక్టీసులో నిమగ్నమైన గ్రామ యువకులు


హున్సాలో పిడిగుద్దులాట (ఫైల్)

నవతెలంగాణ-బోధన్
సాలూర మండలం హున్స గ్రామంలో హోలీ పండుగ సందర్భంగా నిర్వహించే పిడిగుద్దులాటను నిలిపివేయాలని బోధన్ రూరల్ పోలీసులు గ్రామస్తులకు రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. గ్రామంలోని యువకులు, పెద్దలు గత నాలుగు రోజులుగా జోరుగా ప్రాక్టీసు నిర్వహిస్తున్నారు. గురువారం జరిగే కామదహనం అనంతరం శుక్రవారం సాయంత్రం 5గంటలకు ఈ పిడిగుద్దులాట కొనసాగనుంది. దాంతో వారం నుంచే ప్రాక్టీసు చేయడంలో గ్రామ యువకులు నిమగ్నమయ్యారు.

గ్రామస్తులకు పోలీసుల నోటీసులు..
హెూలీ సందర్భంగా గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే పిడిగుద్దులాటను నిలిపివేయాలని రెండు రోజుల క్రితం బోధన్ రూరల్ పోలీసులు గ్రామస్తులకు నోటీసులు జారీచేశారు. కాని తరతరాలుగా వస్తున్న సాంప్రదాయాన్ని తాము రద్దుచేసే ప్రసక్తే లేదని పిడిగుద్దులాటను ఆడి తీరుతామని గ్రామస్థులు పేర్కొంటున్నారు. రంగులు చల్లుకొని, పూసుకోవడం సాంప్రదాయం కానీ.. ఈ గ్రామంలో మాత్రం రంగులు పూసుకోవడమే కాదు. ఆనవాయితీ ప్రకారం సాంప్రదాయంగా పిడి'గుద్దులాట'ను తరతరాల నుంచి గ్రామస్థుల కొనసాగిస్తున్నారు. గతంలో హెూలీ పండగ సందర్భంగా గ్రామంలో గతంలో మహారాష్ట్ర నాట్య కళాకారులచే కచేరీలు, నాటకాలు ప్రదర్శించడంతో జనం రద్దీ కనిపించేది. తమ బంధువులను ఆహ్వానించి రెండు రోజుల పాటు పండగ ఘనంగా నిర్వహిస్తారు. గ్రామం నడిబొడ్డున నిర్వహించే ఈ పిడిగుద్దులాట గతంలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది. దాంతో మహారాష్ట్ర, కర్ణాటక, ప్రాంతాల నుంచి జనం ఈ ఆటను తిలకించేందుకు తరలివస్తారు. ప్రస్తుతం సమీప గ్రామాల ప్రజలు ఎప్పటిలాగే ఈ ఆటకోసం వస్తున్నారని పలువురు పేర్కొన్నారు.

నేటి హైటెక్ యుగంలోనూ ఆటవిక క్రీడా..
తరతరాల నుంచి సాంప్రదాయం పేరుతో ఒకరికొకరు కొట్టుకుంటూ ఆడే ఈ పిడిగుద్దులాట.. నేటి శాస్త్ర సాంకేతిక యుగంలో గ్రామంలో గతంలో ఈ ఆటలో పాల్గొనే వారే పిడిగుద్దులాటలో తలపడుతున్నారని, కానీ విద్యావంతులు, ఉన్నత విద్యను అభ్యసించే యువకులు ఈ ఆటకు దూరం ఉంటున్నారని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దాంతో ఈ ఆట పాత తరం వారితోనే కొనసాగుతుందని, యువకుల ఆసక్తిని బట్టి భవిష్యత్తులో ఈ ఆట మనుగడ ఆధారపడి ఉందని మరికొందరు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి పేరు ప్రఖ్యాతులు సాధించిన ఈ పిడిగుద్దులాటను వదలమని, ప్రతి సంవత్సరంలాగే ఈ పిడిగుద్దులాటలో తాము పాల్గొంటామని కొంతమంది యువకులు పేర్కొన్నారు. పోలీసు బందోబస్తు ఉన్న దర్జాగా కొట్టుకోవడం అనేది హున్స గ్రామస్తులకే సాధ్యం.

పోలీసు బందోబస్తు చేపడతాం

హున్స గ్రామంలో హెూలీ పండుగ సందర్భంగా పిడిగుద్దులాటను రద్దు చేయాలని గ్రామస్థులకు నోటీసులు అందించాం. సాంప్రదాయంలో భాగంగా కొనసాగుతున్న ఈ పిడిగుద్దులాట వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు నిర్వహించడానికి చర్యలు చేపట్టాం. ఆటలో భాగంగా ఏదైన అవాంఛనీయ ఘటనలు జరిగితే చట్టరీత్యా చర్యలు చేపడతాం.
- ఏసీపీ, శ్రీనివాస్.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులను కేటాయించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్



నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్
రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 30 శాతం నిధులను కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాచకొండ విగ్నేష్ అన్నారు. గురువారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా మార్చి 12 నుంచి 27 వరకు జరిగే అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగానికి నిధులు కేటాయించాలని స్థానిక మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా విగ్నేష్ మాట్లాడుతూ.. కొఠారి కమిషన్ సిఫారసుల మేరకు రాష్ట్ర బడ్జెట్‌లో 30శాతం నిధులను ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలన్నారు. అదే విధంగా తెలంగాణ యూనివర్సిటీకి 500 కోట్ల నిధులు కేటాయించి, ఇంజనీరింగ్ కళాశాలను, హార్టికల్చర్ కళాశాలలను ఏర్పాటుకు కషి చేయాలని తెలిపారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లను గ్రీన్ ఛానల్ వ్యవస్థకు మార్చాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ కాస్మోటిక్ చార్జీలను పెంచాలని సూచించారు. అద్దె భవనాలల్లో ఉన్న సంక్షేమ హాస్టళ్లకు పక్కాభవనాలను నిర్మించాలన్నారు. గర్ల్స్ హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థినిలకు సేఫ్టీ ప్యాడ్స్, నాప్కిన్స్ అందించాలని సూచించారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలలను డిజిటలైజ్ చేయాలని కోరారు. అనంతరం ఏఓకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షురాలు దీపిక, జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, రాజు, నగర అధ్యక్షులు ఆజాద్, యునివర్సిటీ నాయకులు పథ్వి, నగర నాయకులు పరమేష్, శ్రీ చరన్, రమేష్, అజయ్, సాయి కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రత పట్ల సబ్‌కలెక్టర్ ఆగ్రహం


వైద్యులకు సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

నవతెలంగాణ-మద్నూర్
మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపీ వద్ద అపరిశుభ్రంగా ఉండటంతో వాటిని పరిశీలించి స్టాఫ్‌నర్సుపై సబ్‌కలెక్టర్ సీరియస్ అయ్యారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని.. సమయపాలన పాటించని డాక్టర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. హాస్పిటల్ మొత్తం కలియతిరిగి రోగులకు అందుతున్న వైద్యం గురించి ఆరా తీశారు. వారి బాగోగులు అడిగి తెలుసుకున్నారు. బాలింతల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ ఎండి ముజీబ్, ఆసుపత్రి సూపరింటెండెంట్ ఆనంద్ జాదవ్, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు

గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లు

- రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్
- కలెక్టర్లతో జూమ్ మీటింగ్

నవతెలంగాణ-కామారెడ్డి
యువతలో వత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే పలు రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐ.టి.ఐ, ఏ.టీ.సీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్‌లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్‌స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. చర్చించిన అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే సమర్పించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ కలెక్టర్లను కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ.. జిల్లాలోని కామారెడ్డి, బాన్సువాడ నియోజకవర్గాల్లో ఐటీఐల ఏర్పాటుకు అవసరమైన రెండు ఎకరాల చొప్పున భూములను గుర్తించి ప్రతిపాదనలు సమర్పిస్తామని తెలిపారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని బిచ్కుంద మండల కేంద్రంలో ఐ.టీ.ఐ. ఉన్నదని తెలిపారు. ఈ జూమ్ కాన్ఫరెన్స్‌లో కార్మికశాఖ సహాయ కమిషనర్ ఎం.కోటేశ్వర్లు, కలెక్టరేట్ సెక్షన్ పర్యవేక్షకులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంలో ఇరువర్గాల మధ్య ఘర్షణ

- దాడిలో ఒకరికి గాయాలు



నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్
మండలంలోని జగన్నాథపల్లి గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం విషయంలో ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కాగా ఈ దాడిలో ఒకరికి గాయాలయ్యాయి. గ్రామస్తుల కథనం ప్రకారం.. జగన్నాథపల్లి గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సిసి రహదారి నిర్మాణాన్ని చేపట్టారు. అయితే రహదారి నిర్మించే ప్రాంతంలో ఈ స్థలం తమదంటే తమదే అని ఇరువర్గాల మధ్య ఘర్షణ ప్రారంభమైంది. మాటా మాటా పెరిగి రెండు వర్గాల వారు రెచ్చిపోయి ఇటుకలతో దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఒకరి తలకు గాయం కాగా చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. విషయం పోలీసులకు తెలియడంతో ఎస్ఐ మహేందర్ ఘటనాస్థలికి చేరుకుని ఘర్షణకు కారణమైన పరిస్థితిపై విచారణ చేపట్టారు. ఈ విషయం గురించి ఎస్ఐ మహేందరను వివరణ కోరగా.. తమపై దాడి చేశారంటూ ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు తెలిపారు.


విచారణ చేపడుతున్న పోలీసులు

జిల్లా ప్రజలకు హోలీ శుభాకాంక్షలు

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ
హెూలీ పండుగను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జిల్లా ప్రజలకు హెూలీ వేడుక శుభాకాంక్షలు తెలియజేశారు. రాగద్వేషాలకు అతీతంగా అందరినీ ఒక్కచోట చేర్చే ఈ హెూలీ వేడుక ప్రజలందరి జీవితాలలో సంతోషపు వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో హెూలీ వేడుక జరుపుకోవాలని అభిలషించారు. సహజ రంగులను వినియోగిస్తూ సంప్రదాయబద్ధంగా హెూలీ నిర్వహించుకోవాలని హితవు పలికారు.



ధర్నాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలి

- సిడిపిఓకు అంగన్వాడి టీచర్లు, ఆయాల వినతి

నవతెలంగాణ-కామారెడ్డి
కామారెడ్డి జిల్లా కేంద్రంలో రెండు రోజులు జరిగే ధర్నాకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ బాన్సువాడ సిడిపిఓకు అంగన్వాడీ టీచర్లు, ఆయాలు సిఐటియు ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17, 18 తేదీలలో కామారెడ్డి కలెక్టర్ కార్యాలయం వద్ద రెండు రోజుల ధర్నా కార్యక్రమం ఉంటుందని.. బాన్సువాడ ప్రాజెక్టులో ఉన్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు సెంటర్లో బందు పెట్టి రెండు రోజుల కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.రవీందర్, ఎండీ ఖలీల్, అరుణ, బాలమని, స్వరూప తదితరులు పాల్గొన్నారు.


వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

- జిల్లా ఎస్పి యం.రాజేష్‌చంద్ర
- జిల్లా కేంద్రంలోని ప్రధాన చౌరస్తాల్లో వాహనాలు తనిఖీలు
- కామారెడ్డి సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం సందర్శన..


వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ రాజేష్‌చంద్ర

నవతెలంగాణ-కామారెడ్డి
మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పి యం.రాజేష్‌చంద్ర అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని నిజాంసాగర్ చౌరస్తా, నరసన్నపల్లి చౌరస్తా (కామారెడ్డి కమాన్) వద్ద జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేశారు. నెంబర్ ప్లేట్లు లేకుండా తిరిగే వాహనాలపై, ర్యాష్, మైనర్ డ్రైవింగ్‌లపై ప్రత్యేక దష్టి సారించారు. ఈ సందర్భంగా ఎస్పీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకోసం వాహనాదారులు తప్పకుండా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనాలు నడపవద్దని అన్నారు. నెంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడుపుతున్న వారిలో యువతే ఎక్కువని, ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలను అప్రమత్తం చేయాలని కోరారు. లైసెన్సు, నంబర్ ప్లేట్, నంబర్ సక్రమంగా లేని, నంబర్ ట్యాంపారింగ్ కలిగిన, నంబర్ తుడిపివేసిన వాహనాలను గుర్తించేందుకు తనిఖీలు చేస్తున్నామని పట్టుబడిన వాహనాలపై అయా పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. మైనర్ డ్రైవింగ్, ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దని అన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చినా కఠిన చర్యలు తీసుకుంటామని, అదే విధంగా ప్రతి వాహనదారుడు తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలు పాటించి, రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా వారి వారి గమ్యస్థానాలను చేరుకోవాలని సూచించారు. ఎస్పి వెంట జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య తదితరులు పాల్గొన్నారు.

హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోవాలి..
హోలీ పండుగను సురక్షితంగా జరుపుకోవాలని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. సురక్షితమైన రంగులను ఉపయోగించాలని సూచించారు. ప్రమాదకరమైన చర్యలకు పాల్పడవద్దని సూచించారు.

కామారెడ్డి సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయం సందర్శన..
కామారెడ్డి సబ్ డివిజన్ పోలీసు కార్యాలయాన్ని ఎస్పి ఎం.రాజేష్ చంద్ర సందర్శించారు. ఈ సందర్భంగా కామారెడ్డి సబ్ డివిజన్ కార్యాలయంలో పరిసరాలతో పాటు, రికార్డ్ గదులను పరిశీలించి, సబ్ డివిజన్లో గల పోలీస్ స్టేషన్‌లకు సంబంధించిన అధికారుల, సిబ్బంది వివరాలను ఏఎస్పి చైతన్య రెడ్డి ఐపిఎస్‌ను అడిగి తెలుసుకున్నారు. ఎస్పి వెంట జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ తిరుపయ్య ఉన్నారు.

ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్, సెషన్స్ జడ్జి కామారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా ఎస్పీ



కామారెడ్డి జిల్లా ఎస్పిగా బాధ్యతలు తీసుకున్న ఎం.రాజేష్‌చంద్ర, ఐపీఎస్ బుధవారం కామారెడ్డి ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ జడ్జి డా.సియచ్.వి.ఆర్.ఆర్.వరప్రదద్‌ను జిల్లా కోర్టులోని ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూల మొక్కను అందజేశారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా కోర్టులో పెండింగ్‌లో గల కేసుల వివరాలపై చర్చించారు.

ఇష్టంలేని వారిపై రంగు చల్లొద్దు

- అమల్లో సిటీ పోలీస్ యాక్ట్
- నిబంధనలు అతిక్రమిస్తే సెక్షన్ 22 ప్రకారం చర్యలు
- ప్రత్యేక బందాలతో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
- బెట్టింగులు ఆడితే సమాచారం ఇవ్వాలి
- నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య


మాట్లాడుతున్న సీపీ సాయిచైతన్య

నవతెలంగాణ-కంఠేశ్వర్
హోలీ పండుగ సమయంలో ఇష్టం లేని వాళ్లపై రంగు చల్లొద్దని, సిటీ పోలీస్ యాక్ట్ అమల్లో ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే సెక్షన్ 22 ప్రకారం చర్యలు తీసుకుంటామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. గురువారం నగరంలోని పోలీస్ కమిషనర్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హోలీ అంటేనే రంగులు అని.. అలాంటి పండగను ప్రతి ఒక్కరూ సంతోషంగా నిర్వహించుకోవాలని ప్రజలకు సూచించారు. హెూలీ పండగ సందర్భంగా ఎవరినీ ఇబ్బంది పెట్టకూడదని సంతోషంగా రంగులు చల్లుకొని ఆనందంగా గడపాలన్నారు. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎక్కడ కూడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తుగా పగడ్బందీ చర్యలు చేపడుతున్నామన్నారు. కావున ప్రజలు పోలీసువారికి సహకరించాలని సూచించారు. హెూలీ పండగ నేపథ్యంలో ఎలాంటి సమస్యలున్నా డయల్ 100, లేదా దగ్గర్లోని సంబంధిత పోలీస్ స్టేషన్కు వెళ్లి సమాచారం అందించాలన్నారు. హెూలీ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని తెలియజేశారు. హెూలీ పండుగ సందర్భంగా యువత మద్యం సేవించి వాహనాలు నడపవద్దని, డ్రంకన్ డ్రైవ్ తనిఖీలకు ప్రత్యేక బందాలను నియమించనున్నట్లు, ద్విచక్ర వాహనాలు గుంపులుగా వెళ్లడం, స్టంట్లు చేయడం వంటివి చేయకుండా పోలీస్ శాఖ నిబంధనలు పాటించాలన్నారు. లేని యెడల, చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. బెట్టింగ్ యాప్స్ ద్వారా చాలామంది యువత తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, ఎలాంటి బెట్టింగ్ యాప్స్ జరుగుతున్నా సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లాలో ఎవరైనా బెట్టింగ్ ఆడితే సమాచారం ఇవ్వాలని సూచించారు. బెట్టింగ్ పెట్టే వారితో పాటు యాప్లను రన్ చేసేవారిని కట్టడి చేస్తామని చెప్పారు. రంజాన్ పండగ రెండవ శుక్రవారం హెూలీ పండుగ ఉండడంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సహకరించాలని కోరారు. రంగులో గంజాయి లాంటి మత్తు పదార్థాలు కలిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలుకే..
నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలుకే పంపుతామని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడిపిన వారిపై మూడు రోజులుగా 168 కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రెండు రోజులు మద్యం దుకాణాల బంద్..
హెూలీ పండుగ నేపథ్యంలో గురువారం నుంచి మద్యం దుకాణాలు మూతపడనున్నాయి. గురువారం సాయంత్రం 6 గంటల నుంచి శనివారం ఉదయం 6 గంటలు వరకు మూసి ఉంచాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సీపీ సాయిచైతన్య కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు అధికారికంగా ఆయన ఉత్తర్వులు జారీ చేశారు. సాయంత్రం 6 గంటల నుంచి వైన్స్ షాపులు మూతపడనుండడంతో మద్యం ప్రియులు వైన్ షాప్స్ వద్ద బారులు తీరుతున్నారు. మరోవైపు మద్యం మత్తులో వాహనాలు నడుపవద్దని సీపీ హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్
శుక్రవారం | మార్చి 14, 2025 | www.navatelangana.com

రేపటి నుంచి ఒంటి పూట బడులు

- మండల విద్యాశాఖ అధికారి బట్టు రాజేశ్వర్

నవతెలంగాణ-బాల్కొండ

విద్యాశాఖ జిల్లా అధికారుల ఆదేశానుసారం 2024-25 విద్యా సంవత్సరంలో మార్చి 15 నుంచి ఏప్రిల్ 23 వరకు ఒంటి పూట బడులు కొనసాగుతాయని మండల విద్యాశాకాధికారి బట్టు రాజేశ్వర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రైమరీ, అప్పర్ ప్రైమరీ, హై స్కూల్‌లు అన్ని మేనేజ్‌మెంట్‌ల పరిధిలో అమలులో ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం, ప్రభుత్వ ఎయిడెడ్, ప్రైవేట్ మేనేజ్‌మెంట్ ఉదయం 8:00 నుంచి 12:30 వరకు పని చేస్తాయని సూచించారు. మధ్యాహ్న భోజనాన్ని మధ్యాహ్నం 12:30 గంటలకు విద్యార్థులకు అందజేస్తామని, ఎస్ఎస్‌సి పబ్లిక్ పరీక్ష నేపథ్యంలో విద్యార్థులను సంసిద్ధం చేయడానికి ప్రత్యేక తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఎస్ఎస్‌సి పరీక్షా కేంద్రాలు ఉన్న పాఠశాలలు మధ్యాహ్నం 1.00 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పని చేస్తాయని మండల విద్యాశాఖ అధికారి తెలిపారు.

సిమెంట్ పోల్ వేయాలని ఒక ఫిర్యాదు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ పట్టణంలోని టౌన్ వన్ సబ్ డివిజన్ పరిధిలో డి వన్ సెక్షన్ పవర్ హౌస్ లో వినియోగదారుల పరిష్కార వేదిక ఉదయం పదిన్నర గంటల నుండి ఒంటి గంట వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల నుంచి సీజీఆర్ఎఫ్ చైర్మన్ ఈ. నారాయణ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. ఒక్క ఫిర్యాదు అందింది. వర్ని చౌరస్తాలో లివింగ్ కె.వి లైన్‌కు సంబంధించిన ఇనుప పోల్‌ను తీసివేసి సిమెంట్ పోల్ వేయాలని రామకృష్ణ వినియోగదారుడు దరఖాస్తు చేశారని తెలిపారు. చైర్మన్ స్పందిస్తూ ఇనుప పోల్‌ను తీసివేసి సిమెంట్ వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో వినియోగదారుల పరిష్కార వేదిక మెంబర్ టెక్నికల్ ఎస్. రామకృష్ణ, మెంబర్ ఫైనాన్స్ కిషన్, ఫోర్త్ మెంబర్ రాజారెడ్డి, టీజీ ఎన్పీడీసీఎల్ తరపున డిఈ ఆపరేషన్ ఎం.శ్రీనివాస్, ఏడిఈ టౌన్-1 ఆర్ చంద్రశేఖర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ మంగ్యా నాయక్, ఏఈ డి-వన్ నగేష్, డి-6 ఏఈ ఎంఏ రాహుఫ్, డి-1, డి-6కు చెందిన వినియోగదారులు పాల్గొన్నారు.

390 గ్రాముల గంజాయి పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్


గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకున్న పోలీసులు

నగరంలోని ఐదవ పోలీస్ స్టేషన్ పరిధిలో 390 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సిఐ సురేష్, ఎస్సై గంగాధర్ గురువారం తెలిపారు. నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ సురేష్ మాట్లాడుతూ.. ఐదవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ గంగాధర్ తన సిబ్బందితో బాబన్ సహాబ్ పహాడ్ వద్ద వాహనాల తనిఖీ గురువారం నిర్వహించారు. ఈ తనిఖీలలో దొడ్డి కొమరయ్య కాలనీకి చెందిన హెూను శెట్టి రవి, మహారాష్ట్ర, నాందేడ్ జిల్లా, సిద్దనత్ పురి, మంధై, ఇత్వరకు చెందిన సయ్యద్ జిలానీ కలిసి పల్సర్ బైకు పై అనుమానాస్పదంగా తిరుగుతూ పోలీసులని చూసి పారిపోతుండగా పట్టుకొని విచారించినట్లు తెలియజేశారు. వారి వద్ద అందాజ 390 గ్రాముల గంజాయి లభించగా సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు. వారు గత కొద్ది రోజుల నుంచి గంజాయికీ అలవాటుపడి నాందేడ్ ఏరియాలో గుర్తు తెలియని వ్యక్తుల దగ్గర గంజాయి కొనుగోలు చేసి అధిక డబ్బులు సంపాదించాలని ఉద్దేశంతో నిజామాబాద్ పరిసర ప్రాంత గ్రామాల్లో అమ్ముతూ ఉంటారని తెలిపారు. బాబన్ సహాబ్ పహాడ్ వద్దకు అమ్మడానికి రాగా వారిని పక్క సమాచారంతో అరెస్టు చేశామన్నారు.

వసతి గృహంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలి

- వైద్యాధికారి డాక్టర్ సుశాంత్ రెడ్డి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

వేసవి కాలంలో నీటిని అధిక మోతాదులో తీసుకోవాలని, వసతి గృహంలో ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సుశాంత్ రెడ్డి సూచించారు.గురువారం మండల కేంద్రంలోని ఖిల్లా డిచ్ పల్లి గ్రామంలోని బిసి బాలికల వసతి గృహంలో ఇందల్వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సుశాంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరం నిర్వహించారు .ఈ శిబిరంలో విద్యార్థులు చిన్నపాటి వ్యాధులతో బాధపడినట్లయితే వారికి మందులు, సలహాలు అందజేశారు. వేసవి కాలంలో తీసుకోవలసిన జాగ్రత్తలను మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ వివరించారు. బాలికలు రక్తహీనతకు గురికాకుండా తాజా ఆకుకూరలు, కూరగాయలు, బెల్లం పట్టీలు, క్యారెట్లు, బీట్రూట్లతో కూడిన ఆహారాన్ని అందించాలని వార్డెన్ పూజారెడ్డికి సూచించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరును అందుబాటులో ఉంచాలని, పరీక్షల సమయంలో మానసిక ఒత్తిడికి గురికాకుండా చదువుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక ఎం.ఎల్.హెచ్.పి డాక్టర్ స్వప్న, ఆరోగ్య పర్యవేక్షకులు దేవపాల ఆరోగ్య కార్యకర్తలు రేణుక, శోభ ఆశా కార్యకర్తలు, విద్యార్థినిలు పాల్గొన్నారు.

అన్నదానం.. మహాదానం

- జిల్లా జడ్జి సునీత కుంచాల


అన్నం వడ్డిస్తున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

నవతెలంగాణ-కంఠేశ్వర్

అన్నిదానాల్లోకెల్ల అన్నదానం మహా దానం అని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. స్థానిక జిల్లా కోర్టు చౌరస్తా ఆవరణలో కటకం లక్ష్మీనారాయణ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ ఇంజనీర్ కటకం శ్రీనివాస్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం గురువారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ చైర్మన్ సునీత కుంచాల హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నదానం ఏర్పాటుచేసి 150 మందికి పైగా భోజన సదుపాయం కల్పించిన కటకం శ్రీనివాస్‌ను అభినందించారు. ఇదివరకు పేద మెరిట్ విద్యార్థులను గుర్తించి వారి ఉన్నత చదువులకు సహాయ సహకారాలు అందిస్తూ ఇంజనీర్లు, డాక్టర్లను తీర్చడంలో కీలకపాత్ర పోషించారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కృపాకర్ రెడ్డి, ఆర్ జగదీశ్వర్, రాజ్కుమార్ సుబేదార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్, పిల్లి శ్రీకాంత్, ఏటిఎస్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

షాపుల ముందు షెడ్లను తొలగించాలని నోటీసుల అందజేత


నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో ఆయా దుకాణ సముదాయాల ముందు ఏర్పాటు చేసుకున్న రేకుల షెడ్లను తొలగించాలని తెలియజేస్తూ స్థానిక గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో షాపుల యజమానులకు నోటీసులను అందజేశారు. గ్రామ పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపులా దుకాణ సముదాయం ముందు రేకుల షెడ్లను వేసుకున్న వారందరికీ నోటీసులను అందజేశారు. దుకాణాలకు సామాను కొనుగోలుకై వచ్చే లబ్ధిదారులు వారి వాహనాలను రోడ్డుపై నిలుపుతున్నందున ఇతర రవాణా వాహనదారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని నోటీసుల్లో పేర్కొన్నారు. వాహనాలను రోడ్లపై పెట్టడంవల్ల పలు సందర్భాల్లో రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించిన ఘటనలు ఉన్నాయని వివరించారు. షాపుల ముందు అదనంగా ఏర్పాటు చేసుకున్న షెడ్లను వారం రోజుల్లోగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో షెడ్లను తొలగించి ఆ ఖర్చును వసూలు చేస్తామని షాపు యజమానులకు నోటీసుల్లో తెలియజేశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం మండల కేంద్రంలోని జాతీయ రహదారి ఇరువైపులా షాప్ ల ముందు అదనంగా షెడ్లను ఏర్పాటు చేసుకున్నా యజమానులందరికీ నోటీసులు గ్రామపంచాయతీ సిబ్బంది అందజేశారు.

మోదుగపూల వసంతహేళి

- నేడు హెూలీ
- వసంతంలో తొలి పండుగ
- వేడుకలకు సిద్ధమైన చిన్నా, పెద్దా
- సహజ రంగులే మేలు, రసాయనాలతో హాని

నవతెలంగాణ-కంఠేశ్వర్



ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల ముగిసిన కాముని దహనం రంగుల పండుగ రానే వచ్చింది.. శిశిరను సాగనంపుతూ వసంతానికి ఆహ్వానించే సందర్భంలో వచ్చే హెూలీ వేడుకకు సమయమైంది. ప్రకృతితో అనుబంధం పెనవేసుకున్న రంగుల కేళీ హెూలీ ఆడుకోవడానికి చిన్నా, పెద్ద తేడా లేకుండా సిద్ధమయ్యారు. కాగా గురువారం రాత్రి ఉమ్మడి జిల్లాలోని ఆయా గ్రామాల్లో ఘనంగా కామదహనం కార్యక్రమాన్ని నిర్వహించారు.చక్కర పేర్లను సేకరించారు.. నూతన నవధాన్యాలతో తయారు చేసిన వంటకాలను తయారు చేసుకుంటారు. ఊరి పొలిమేర వరకు వాయిద్యాల మధ్య ఊరేగిస్తూ తీసుకెళ్లారు. సంస్కృతి సంప్రదాయబద్ధంగా భక్తి, శ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేసి దహనం చేశారు.

సంప్రదాయం ప్రకారం జరుపుకోవాలి...

హెూలీ పండగును సంప్రదాయం ప్రకారం జరుపుకోవాలని, రసాయన రంగులతో జాగ్రత్తగా ఉండాలని కంటి వైద్యులు సూచిస్తున్నారు. పూర్వం గులాల్ పూల రేకులు ఉపయోగించి ప్రకృతి సిద్ధమైన రంగులను వాడే వారన్నారు.. కానీ నేడు పండుగ స్వరూపం మరిచి కృత్రిమ రంగులతో, రసాయానిక రంగులు, గ్రీస్, మోటార్ వాహనాల వ్యర్థపదార్థాలైన అయిల్స్‌ను ఉపయోగిస్తు న్నారు. దీంతో అనేక రుగ్మతలు తలెత్తుతున్నాయని. వీటిని అరికట్టి ప్రకృతి సిద్ధమైన రంగులు వాడి తగు జాగ్రత్తలు తీసకుంటే పండుగను అనందంగా జరుపుకోవచ్చని అన్నారు. శరీరానికి, ఆరోగ్యానికి ఉపయోగపడే పలు సూచనలు చెప్పారు.

ఇవీ జాగ్రత్తలు...

వేడుకలు జరుపుకునే ముందు శీరరమంతా ముందుగా నూనె లేదా పెట్రోలియం జెల్లి రాసుకోవాలి. గులాల్, పౌడర్ రంగులను మాత్రమే ఉపయోగించాలి. రంగులను పూసుకునేటప్పుడు కళ్ళు, నోరుమూసి ఉంచాలి. కృత్రిమ, రసాయానిక రంగులు వాడకూడదు. బలవంతంగా ఇతరుల ముఖం, శరీరంపై పూయరాదు. తెల్లని వస్త్రాలు ధరించడం శ్రేయస్కరం. మన సంతోషాన్ని గురించి ఇతరుల సంతోషాన్ని రంగుల ద్వారా పాడుచేయొద్దు.

పండుగకు ప్రత్యేకం...



రంగోళీ పండుగకు కుడుకలు, చక్కెర బెండ్ల పేర్లు ప్రత్యేకంగా నిలుస్తున్నాయి.. ముఖ్యంగా చిన్నారులను ఎక్కువగా ఆకట్టుకుంటాయి.. నోరు తీపి చేసుకుంటూ ఈ పండగను ఘనంగా జరుపుకుంటారు.. కుడుకల పేర్ల కిలో ధర రూ. 100, చెక్కరబెండ్ల ధర రూ.80వరకు పలుకుతున్నాయి.. సుమారుగా రూ.1.5లక్షల వరకు వ్యాపారం జరుగుతున్నట్లు అంచనా. సుమారుగా రూ.3లక్షల వరకు రంగుల విక్రయాలు జరుగుతున్నట్లు అంచానా. హెలీ సందర్భంగా కుడుకల దండలు చిన్నారుల మెడల్లో వేయడం మన సంప్రదాయం. ఎండు కొబ్బరి, కర్జూరాలు ఆరోగ్యానికి మంచిదని ముఖ్యంగా చిన్న పిల్లకు ఎంతో మేలు చేస్తాయని భావించి వీటిని వారికి బహూమానంగా ఇస్తారు. ప్రస్తుతం మార్కెట్లో కిలో కుడుకల దండలు ధర రూ. 80పలుకుతోంది.

చిన్నారుల కోసం ప్రత్యేక వస్తువులు...

చిన్నారులు పండుగ పూట రంగులాటల్లో మునిగి చిన్నారులు సరదాగా గడుపుతారు. అందుకే వారి అభిరుచికి తగ్గట్లుగా పలు బొమ్మ స్ప్రేయర్లు మార్కెట్లోకి వచ్చేశాయి.. రంగులను చల్లుకునేందుకు రకరకాల బొమ్మలతో తయారు చేసిన స్ప్రేయర్లు పిల్లలను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. పిస్తోల్, పిల్లనగ్రోవి, ఐస్క్రీమ్, కార్ల ఆకారాల్లో పిచికారి బొమ్మలు అందుబాటులో ఉన్నాయి. ఈ రంగుల స్ప్రేయర్ల ధరలు రూ.10నుంచి రూ.200వరకు ఉన్నాయి.. వివిధ రకాల రంగులను మార్కెట్లో విక్రయిస్తున్నారు.. ముఖ్యంగా పట్టణానికి చెందిన రంగుల వ్యాపారులు పెద్ద ఎత్తున రంగుల దుకాణాలను ఏర్పాటు చేశారు. పౌడర్ రంగులు అందుబాటులో ఉన్నాయి. ధర యాభై గ్రాములకు రూ.10నుంచి విక్రయిస్తున్నారు. చిన్నారులకు అందుబాటు ధరలో ఉండే ప్లాస్టిక్ బొమ్మల స్ప్రేయర్స్ వచ్చాయి



మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు
- టీఎన్జీవోల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహిళా దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్‌సిటీ


మహిళలను సన్మానించిన కలెక్టర్

మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు సూచించారు. తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల యూనియన్ ఆధ్వర్యంలో గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అద్భుతాలు సాధించగలరని అన్నారు. ఏ రంగంలో ఉన్న బాధ్యతలు మర్చిపోవద్దని, అందుబాటులో ఉన్న అవకాశాలు సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగాలని అన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని గుర్తు చేశారు. మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సదుపాయం అందుబాటులోకి తెచ్చిందని, క్యాంటీన్‌ల నిర్వహణ, యూనిఫాంలు కుట్టే బాధ్యతలను అప్పగించిందని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కాగా, మహిళా ఉద్యోగులు ఇంటి పనులు, ఉద్యోగ విధులను సమన్వయం చేసుకుంటూ ఆరోగ్యాల పట్ల శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ హితవు పలికారు. ఈ సందర్భంగా మహిళా ఉద్యోగులను, వివిధ రంగాలలో ప్రముఖంగా సేవలు అందిస్తున్న మహిళలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, మహిళా, శిశుసంక్షేమ జిల్లా అధికారిణి రసూల్ బీ, జిల్లా పౌర సంబంధాల అధికారిణి నార్ల పద్మశ్రీ, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారిణి కృష్ణవేణి, టీఎన్జీవో జిల్లా సంఘం అధ్యక్ష, కార్యదర్శులు సుమన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధికంగా మొక్కలు చనిపోయాయి

- 16వ విడత సామాజిక తనిఖీలో వెల్లడి

నవతెలంగాణ-మోర్తాడ్

గ్రామీణ ఉపాధి హామీ పథకం 16వ విడత సామాజిక తనిఖీ సభ గురువారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ రిపోర్టును చదివి వినిపించారు. ఉపాధి పథకం ద్వారా నాటిన మొక్కలు అధిక శాతం లో చనిపోయి ఉన్నాయని, నివేదిక ప్రకారం ఆ ప్రాంతాల్లో మొక్కలు లేవని తెలిపారు. వెయ్యి మొక్కలు నాటినట్లు రికార్డులలో ఉంటే ఐదు నుండి 600 వరకు మాత్రమే మొక్కలు బతికి ఉన్నాయని, చనిపోయిన మొక్కల ప్రాంతంలో నూతన మొక్కలను నాటుతున్నామని తెలిపారు. పతి గ్రామంలో ఒకరికి బదులు మరొకరు ఉపాధి కూలీ పనికి వెళ్తున్నారని, వారి డబ్బులను వీరి ఖాతాలో వేసి అక్రమాలకు పాల్పడుతున్నట్లు తెలిపారు.

మస్టర్లో కూలీలు 10 రోజులు పని చేసినప్పటికీ ఎనిమిది రోజుల వేతనాలని ఇస్తూ మరో రెండు రోజుల వేతనాలను ఇవ్వకుండా వారిని ఇబ్బందులకు గురిచేసినట్లు తెలిపారు. కొన్ని ప్రాంతాలలో పనులు చేయకుండా పనులు చేసినట్లు రికార్డులలో నమోదైనట్లు తెలిపారు.

అధికారుల సంతకాలు లేకుండానే కూలీలకు వేతనాలు చెల్లించినట్లు కూడా నివేదికలో తెలిసినట్లు తెలిపారు. మండలంలో అత్యధికంగా మొక్కల నాటడంలో అధిక అక్రమం జరిగినట్లు నివేదికలో తెలిసింది. భారీ స్థాయిలో మొక్కల ఎదుగుదలకు కృషి చేయాల్సిన సిబ్బంది వాటిపై పరిశీలన సక్రమంగా లేక చనిపోయినట్లు తెలిపారు. అతి గ్రామంలో ఒకరికి బదులు ఒకరిని కూలి పనులకు పంపించిన వారి నుండి రికవరీ చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఈ కార్యక్రమంలో జిల్లా రాష్ట్ర ఉపాధి సిబ్బందితోపాటు సామాజిక తనిఖీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న పలువురు

ట్రాఫిక్ నియమాలను పాటించాలి

- రోడ్డు ప్రమాదం దురదృష్టకరం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన నుడా చైర్మన్


ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న నుడా చైర్మన్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ట్రాఫిక్ నియమాలను జాగ్రత్తగా పాటించాలని నిజామాబాద్ నుడా చైర్మన్ కేశ వేణు అన్నారు. ఈ మేరకు నిజామాబాద్ నుడా చైర్మన్ కేశ వేణు ఫులాంగ్ చౌరస్తా బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదం నిజంగా దురదృష్టకరం అని ఈ సమస్యను పరిష్కరించడానికి, మున్సిపల్ అధికారులు, ట్రాఫిక్ అధికారులతో కలిసి ప్రమాద స్థలాన్ని గురువారం సందర్శించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా తీసుకోవాల్సిన తక్షణ చర్యలను గుర్తించడానికి కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించామన్నారు. త్వరిత గతిన చర్యలు తీసుకోవడం ప్రాముఖ్యతను కూడా వివరించారు. అవసరమైన జాగ్రత్తలు అమలు చేయాలని అధికారులను కోరారు. అదనంగా రోడ్డు భద్రతను పెంచడంలో, ప్రమాదాలను నివారించడంలో కీలకమైన ట్రాఫిక్ నియమాలను పాటించాలని నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నిజామాబాద్ ట్రాఫిక్ సిఐ ప్రసాద్, నగర సిఐ శ్రీనివాసరాజు, మున్సిపల్ అధికారులు సాజిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

13 క్వింటాళ్ల గుడాల పంపిణీ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని లక్ష్మీనారాయణ మందిరంలో ఎస్-ఎస్‌కె సమాజ్ ఆధ్వర్యంలో గురువారం క్షత్రియులకు గుడాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో. రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఖాందేష్ శ్రీనివాస్, క్షత్రియ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి పండిత్ ప్రేమ్, అధ్యక్షుడు రెడ్డి ప్రకాష్ మాట్లాడుతూ హెూలీ పండుగ సందర్భంగా 13 క్వింటాళ్ల గుడాలు పంపిణీ చేశామని తెలిపారు. ప్రతి ఏడాది ఈ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తామన్నారు. హెూలీని ప్రశాంతంగా జరుపుకుందామని అన్నారు. కార్యక్రమంలో క్షత్రియ సమాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకానికి రూ.250 కోట్లు నిధులు కేటాయించాలి



మాట్లాడుతున్న నాయకులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

మధ్యాహ్న భోజన పథకానికి రూ.250 కోట్లు నిధులు కేటాయించాలని ఏఐటీయూసీ డిమాండ్‌చేసింది. జిల్లా కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై. ఓమయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకంపై రాష్ట్ర ప్రభుత్వం రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐన ఆకునూరి మురళి ఆధ్వర్యంలో కమిటీ వేసి రాష్ట్రంలో మధ్యాహ్న భోజన పథకం స్థితిగతులపై అధ్యయనం చేసి రిపోర్టును రాష్ట్ర ప్రభుత్వానికి ఇచ్చారన్నారు. కానీ ఆ రిపోర్టు సంబంధించిన అంశాలు బహిర్గతం చేయకపోవడం సరైన పద్ధతి కాదన్నారు. కమిటీ రిపోర్టు ఆధారంగా రాష్ట్రంలో 250 కోట్ల రూపాయల నిధులు కేటాయించి గ్రీన్ ఛానల్ ద్వారా ప్రతి నెల మొదటి వారంలో మధ్యాహ్న భోజన కార్మికులు పెట్టిన బిల్లులు చెల్లిస్తూ ప్రభుత్వం ప్రతిపాదించిన వారానికి నాలుగు రోజులు గుడ్లు, రాగి జావా, కూరగాయలు, పప్పులు భోజనం కై ప్రయత్నం చేయాలన్నారు. ఈ భోజనం పెట్టాలంటే ఒక విద్యార్థికి కనీసం రోజుకు 25 రూపాయలపైనే ఖర్చు అయ్యే అవకాశం ఉందని అన్నారు. ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో మధ్యాహ్న భోజన పథకానికి 250 కోట్ల బడ్జెట్ కేటాయించడంతోపాటు ఎన్నికల హామీలో భాగంగా 10వేల రూపాయల వేతనాన్ని అమలు చేయాలని, కార్మికులందరికీ యూనిఫారం డ్రెస్ కోడ్ అమలు చేయాలని, గుర్తింపు కార్డులు, పిఎఫ్, ఈఎస్ఐ, ఇన్సూరెన్స్ సౌకర్యాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళన చేస్తామన్నారు. ఈ ప్రెస్ మీట్‌లో ఉపాధ్యక్షులు చక్రపాణి, కార్యదర్శి పి హనుమాన్లు పాల్గొన్నారు.

మక్కా మసీద్‌ను దర్శించుకున్న హైకోర్టు సీనియర్ న్యాయవాది



నవతెలంగాణ-లింగంపేట్

ముస్లింల పవిత్ర ప్రాంతమైన మక్కా మసీదును రాష్ట్ర జలమండలి మాజీ సభ్యులు, హైకోర్టు సీనియర్ న్యాయవాది మహమ్మద్ మొయినమ్మద్ ఖాద్రి దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింల ఆరాధ్య దైవం మహమ్మద్ ప్రవక్త జన్మస్థలం మక్కా మసీదు కావడంతో రాష్ట్ర హైకోర్టు సీనియర్ న్యాయవాది మొహమ్మద్ మోహినమ్మద్ ఖాద్రితో పాటు లింగంపేట్ మైనార్టీ నాయకులు అబ్దుల్ వహాబ్, జమీల్ ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రెండో రోజు కొనసాగిన దీక్షలు

నవతెలంగాణ-బోధన్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ రిజర్వేషన్‌ను ఏబిసిడిలుగా వర్గీకరించి చట్టబద్ధత కల్పించాలని కోరుతూ సాలూరు మండల కేంద్రంలో చేపడుతున్న రిలే దీక్షలు గురువారం రెండో రోజు కొనసాగాయి. ప్రభుత్వం ఎస్సీలలోని ఉపకులాలకు సమన్యాయం చేయడంలో భాగంగా ఏబీసీ వర్గాలుగా కాకుండా ఏబిసిడి వర్గాలుగా విభజించి వర్గీకరణ అమలు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే వరకు ఎలాంటి ఉద్యోగ ప్రకటనలు చేయవద్దని.. ఫలితాలను వెల్లడించవద్దని వారు డిమాండ్ చేశారు. లేనియెడల రిలే దీక్షలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ దీక్షలలో మండల అధ్యక్షులు శంకర్ జిల్లా నాయకులు పోచిరాం, మండల ప్రధాన కార్యదర్శి రెడ్డి దిలీప్ మాదిగ, సాలంపాడ్ గ్రామ పెద్దలు, సీనియర్ నాయకులు ముంజే గంగారం మాదిగ, ముంజే గంగారం పెద్ద మాదిగ, సుంకిని గ్రామ నాయకులు గాయక్వాడ్ గంగాధర్ మాదిగ, బూరే అశోక్ మాదిగ పాల్గొన్నారు.

రంగుల సంబురం

- పలు గ్రామాల్లో కామదహనం
- ఘనంగా హోళీ వేడుకలు
- ఉత్సాహంగా పాల్గొన్న యువతీయువకులు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఉమ్మడి జిల్లాలోని పలు గ్రామాల్లో హోలీ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం రాత్రి కామదహనం చేపట్టారు.

బోధన్ : సాలూర మండలంలో హెూలీ సంబరాలలో భాగంగా గ్రామస్థులు రంగులు చల్లుకుంటూ హెూలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు. బుధవారం రాత్రి కామ దహనం నిర్వహించి, గురువారం ఉదయం గ్రామస్తులు రంగులు చల్లుకుంటూ హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. కుల మతాలకతీతంగా గ్రామస్తులు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఇల్తెపు శంకర్, అల్లె జనార్ధన్, వెంకట పటేల్, లింబూరి లక్ష్మణ్ (తేజ), సింగడి పాండు, ఎల్మ దత్తు, కన్నె అశోక్, నాగరాజు, బుద్దె లక్ష్మణ్, చంటి, సుభాష్, ఎల్ఐసి దత్తు, స్వామిగౌడ్, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కామ దహనం, హోళీ..

పోతంగల్ : మండల కేంద్రంలో కామ దహనంలో గ్రామ యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సంప్రదాయ బద్ధంగా, పెద్ద పోచమ్మ గుడివద్ద పవిత్రంగా అగ్గి రాజేసి దానిని, బాజాబజంత్రిలతో, గ్రామస్తులు ఊరేగింపుగా హనుమాన్ మందిరం కూడలివద్ద కట్టెలు, పిడకలతో పేర్చిన హెూలీ దహనం చేశారు. కొత్త పోతంగల్‌లో చావిడి వద్ద, బాలాజీ మందిరం కూడళ్ళలో హెూలీ దహనం చేశారు. ఆడపడచులు నిండుకుండలతో నీటిని తర్పణం చేసి, శెనిగలను కాల్చి అందరూ తిన్నారు. కాల్చిన శనగలు తినడం వల్ల దంతాలు గట్టిగా ఉంటాయని నమ్మకం. ఆడబిడ్డలకు కొబ్బరి ఖర్జురాలతో తయారుచేసిన దండలను (పేర్లను) ఇచ్చారు. మండల కేంద్రంలో అనాధిగా కాముడును ఒకరోజు కాల్చి, రెండు రోజులు రంగులతో హెూలీ పండుగ జరుపుకోవడం అనవాయితీగా వస్తోంది.



భిక్కనూర్: చైతన్య పాఠశాలలో హోలీ సంబురాలు



లింగంపేట్: ఐలాపూర్ పాఠశాలలో



పొతంగల్‌లో...

రెంజల్ : మండల కేంద్రంలో ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు గ్రామ యువత హోలీ పండుగను ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా రంగులు చల్లుకొని హోలీ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు నాగభూషణంరెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్ కుమార్, సాయిరెడ్డి, కురుమే శ్రీనివాస్, ధనుంజయ్, ఆసాని ప్రశాంత్, అంజయ్య, సాయా గౌడ్, ఆసాని అనిల్, సాయిబాబా, నారాయణ, వేణు, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.

ఐలాపూర్ పాఠశాలలో హెూలీ..

లింగంపేట్ : మండలంలోని ప్రాథమిక పాఠశాల అయిలాపూర్‌లో హెూలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు దామోదర్ మాటాడుతూ.. హెూలీ విశ్వవ్యాప్తంగా ప్రకాశించే పండుగ అన్నారు. విద్యార్థులకు రసాయన రంగులు వాడొద్దని సూచించారు. సహజ రంగులు ఉపయోగిస్తూ ఒకరిపై ఒకరు చల్లుకొని ఆనందాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివనంద, లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

పిట్లం లో ఘనంగా హెూలీ సంబరాలు

పిట్లం : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలో హెూలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఒకరికొకరు ఆప్యాయంగా రంగులను చల్లుకుంటూ సాంప్రదాయ బద్ధంగా నృత్య, కేరింతలతో ఉల్లాసంగా గడిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్‌లో..

మండల కేంద్రంలో బుధవారం రాత్రి గ్రామంలోని ప్రధాన కూడలి వద్ద కామ దహనాలు చేశారు. ఆనవాయి తీగా గురువారం హోలీ సంబరాలను జరుపుకున్నారు.

ఎడపల్లి: మండలంలోని ఏఆర్‌పి క్యాంప్, బ్రాహ్మణపల్లి, పోచారం, జైతాపూర్, జమలం, అంబం వై, జానకంపేట్ గ్రామాలలో బుధవారం రాత్రి గ్రామ పెద్దల సమక్షంలో కామదహనం నిర్వహించారు. గురువారం హెూలీ పండగలో సంబరాలు జరుపుకున్నారు. ఒకరినొకరు రంగులు చల్లుకొని హెూలీ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి పలు గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ సిబ్బందిని ఏర్పాటు చేసి ఆయన సైతం పర్యవేక్షించారు.

చైతన్య పాఠశాలలో హెూలీ..

భిక్కనూర్ : పట్టణ కేంద్రంలోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో హెూలీ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు రంగులు చల్లుకుని సంబరాలు నిర్వహించుకున్నారు. ప్రతి ఒక్కరూ హెూలీ సంబరాలను ఇలాంటి అల్లర్లు, గొడవలు చేయకుండా సంతోషంగా జరుపుకోవాలని పాఠశాల కరస్పాండెంట్ రేణు కుమార్, ప్రధానోపాధ్యాయులు అశోక్ యాదవ్. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గాంధారి : మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలల్లో, పలు గ్రామాల్లో హెూలీ పండుగను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని కేటీఎస్, ఆదర్శ విక్టరీ తదితర పాఠశాలలో హెూలీ సంబరాలు విద్యార్థులచే ఘనంగా నిర్వహించారు.

సదాశివనగర్ : మండలంలోని పలు గ్రామాల్లో హెూలీ పండుగను గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని కల్వరాల్, మోడేగాం, ఉత్నూర్ తదితర గ్రామాల్లో హెూలీ పండుగను ఘనంగా నిర్వహించారు. మోదుగు పువ్వుతో రంగులు తయారు చేసుకొని పిల్లలు పెద్దలు రంగుల పండుగను జరుపుకున్నారు.

హిందీ అధ్యాపకుడిని సన్మానించిన గపూర్ శిక్షక్

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన హిందీ లెక్చరర్ పోస్టులలో కామారెడ్డికి చెందిన హిందీ పండిత్ ఉపాధ్యాయుడు రమేష్ చైతన్య ఎంపిక కావడం పట్ల రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నదని ఆర్‌యుపిపిటిజి పండిత పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గపూర్ శిక్షక్ అన్నారు. ఈ సందర్భంగా రమేష్ చైతన్యను సన్మానించరు. జూనియర్ లెక్చరర్ హిందీని సాధించిన రమేష్ చైతన్య ఉత్తమ ఉపాధ్యాయుడే కాకుండా మంచి శిక్షణ నైపుణ్యాలు కలిగిన మోటివేటర్‌గా విద్యార్థులకు ఎంతోమందికి శిక్షణను గతంలో మేటి ఉపాధ్యాయునికి మేటి ర్యాంకుతో హిందీ లెక్చరర్‌గా ఉద్యోగం రావడం పట్ల అభినందించారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య

నవతెలంగాణ-లింగంపేట్

చెరువులో దూకి మహిళ ఆత్మహత్య చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. మండలంలోని మంబోజిపేట్ గ్రామానికి చెందిన మాది కాశవ్వ (51) అనే మహిళ గత కొన్ని రోజులుగా కాళ్ల నొప్పులతో బాధపడుతోంది. అయితే నాలుగు రోజుల క్రితం హాస్పిటల్‌కు వెళ్తానని ఇంట్లో నుంచి వెళ్లింది. తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు వెతికినా లభించలేదు. గురువారం ఉదయం మంబోజిపేట్ భవానిపేట్ సమపంలోని సింగయ్య చెరువులో మృతదేహం కనిపించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఎస్సై వెంకట్రావు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఆత్మహత్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కాగా ఆమెకు ఇద్దరు కుమారులు ఉన్నారు. శవానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కుమారుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

హోలీని ఆనందంగా జరుపుకోవాలి

- ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

హోలీని ఆనందంగా జరుపుకోవాలని ఎడపల్లి ఎస్సై వంశీకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని సూచించారు. పండుగ సందర్భంగా యువకులు ఘర్షణలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే వారిపై చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ఖాళీగా ఉన్న బోధనా సిబ్బందిని వెంటనే భర్తీ చేయాలని టీజీవిపి జిల్లా అధ్యక్షుడు సంజయ్ తెలిపారు. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ప్రవేశ పెట్టబోయే రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయించాలన్నారు. గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సంజయ్ మాట్లాడుతూ.. విద్యారంగంలో సమూల మార్పులు తీసుకొస్తామని అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగంపై సవితితల్లి ప్రేమ చూపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎండి సమీర్‌ఖాన్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన విహారయాత్రలో విద్యార్థులు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని ఒంటరిపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు గురువారం పోచారం అభయారణ్యాన్ని, పోచారం డ్యామును సందర్శించారు. విజ్ఞాన విహారయాత్రలో భాగంగా పలు ప్రాంతాలను సందర్శించారు. పోచారం ప్రాజెక్టు ప్రాంతంలోని వన్యప్రాణుల సంరక్షణ, నిర్వహణను విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం అటవీ శాఖ వాహనంలో జింకల కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులు ఆసక్తితో తిలకించారు. విద్యార్థులందరూ ఎంతో ఆనందంగా, ఆసక్తితో వన్యప్రాన్యులను గమనించారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రజనీకాంత్‌గౌడ్ తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు కిరణ్మయి, విద్యార్థులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో హెల్త్ క్యాంప్

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వరనగర్ గ్రామ సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో గురువారం హెల్త్‌క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ అధికారి దివ్య విద్యార్థులకు వైద్య పరీక్ష నిర్వహించి మందులు అందజేశారు. భోజన సమయంలో చేతులు శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ రఘు, ఎస్‌విపి వెంకటేష్, జెవిపి దేవా, ఏఎన్ఎం యాదమ్మ, ఎంపీహెచ్ఏ సతీష్, ఆశావర్కర్ నీలిమా తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

నవతెలంగాణ-భిక్కనూర్

క్రీడల్లో గెలుపోటములు సహజమని తహసిల్దార్ శివప్రసాద్, సిఐ సంపత్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలో తిప్పాపూర్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ ఆటల పోటీలలో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఆంజనేయులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు భీమ్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్సీ కవిత జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి

భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జన్మదినాన్ని నాయకులు గురువారం ఘనంగా నిర్వహించారు. భారత జాగృతి బోధన్ నియోజకవర్గం అధ్యక్షుడు గట్టు హరికృష్ణ ఆధ్వర్యంలో జాడీ గ్రామంలో గల వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పాముల వెంకట్, నార్ల రాజేష్, బొడ్డు రవి, దండు తేజ, సందీప్ మరియు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు జన్మదిన శుభాకాంక్షలు

ఎడపల్లి : మండలంలోని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తాజా మాజీ సర్పంచులు గురువారం నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా నాయకులు హైదరాబాద్ వెళ్లి ఆమె నివాసంలో ఆమె కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎడపల్లి మండల సేవాదళ్ నాయకులు శేఖర్ రాజ్, కుర్నపల్లి సర్పంచ్ సావిత్రి రవీందర్ గౌడ్, తెలంగాణ శంకర్, మాణిక్యాల సురేష్ గౌడ్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తారాచంద్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

డిగ్రీ పరీక్షల ఫీజు నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ బిఏ, బీకాం, బిఎస్సి, బిబిఏ కోర్సుల రెండవ, నాలుగవ, ఆరవ సెమిస్టర్(రెగ్యులర్) మరియు ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ 2020 -24 బ్యాచ్ విద్యార్థులకు థియరీ పరీక్షలకు ఏప్రిల్ మే, 2025 లో హాజరయ్యే విద్యార్థులందరూ పరీక్ష ఫీజు చెల్లించు చివరి తేదీ 26-03-2025 వరకు 100 రూపాయల అపరాధ రుసుంతో తేదీ 27-03-2025 వరకు చెల్లించ గలరని పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కే.సంపత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాల కోసం తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరినట్టు పేర్కొన్నారు.

షబ్బీర్ అలీకి కాంగ్రెస్‌లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలి

నవతెలంగాణ-కామారెడ్డి



షబ్బీర్ అలీకి కాంగ్రెస్ పార్టీలో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు రావుల ప్రభాకర్ అన్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటేనే షబ్బీర్ అలీ, షబ్బీర్ అలీ అంటేనే కాంగ్రెస్ పార్టీ అనేలా కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం కష్టపడ్డారని తెలిపారు. ఆయనకు భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్న సమయంలో ఒడిదోడుకులు వచ్చినా భయపడకుండా పార్టీ కోసం, ప్రజల కొరకు అహర్నిశలు కష్టపడ్డ వ్యక్తి అని కొనియాడారు.

కొలతల ప్రకారం పనులు నిర్వహించాలి

- టెక్నికల్ అసిస్టెంట్ నర్సయ్య

నవతెలంగాణ-రామారెడ్డి

ఉపాధి హామీ పనిలో కూలీలు కొలతల ప్రకారం పనులు నిర్వహించి పనికి తగిన వేతనాన్ని పొందాలని టెక్నికల్ అసిస్టెంట్ నర్సయ్య కూలీలకు సూచించారు. గురువారం మండలంలోని మద్దికుంటలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని కూలీలు ఉదయమే పనిలోకి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ కామెల్లి చిన్నస్వామి, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండలంలోని పలు గ్రామాల్లో సీఎంఆర్ఎఫ్, కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను గురువారం పంపిణీ చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో లబ్దిదారుల ఇంటికి వెళ్లి వారికి చెక్కులు పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూకాంటి సంగారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జూకంటి సంగారెడ్డి, సిడిసి చైర్మన్ ఇర్న దుద్దిన్, పద్మాజీవాడి సింగిల్‌విండో చైర్మన్ గంగాధర్, మాజీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ బీరయ్య, వడ్ల రాజేందర్, జగ్గా బాలరాజు, కవీన్ కుమార్, రాజయ్య సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

తాడ్వాయి : మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపాల్ బి.సురేఖ తెలిపారు. గురువారం జువాలజీ, మ్యాథ్స్ పరీక్షలకు 200 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 198 విద్యార్థులు హాజరయ్యారని ఇద్దరు గైర్హాజరైనట్టు తెలిపారు. విద్యార్థులను గేటు వద్ద తనిఖీలు చేస్తూ కళాశాలలోనికి పంపించారు. కళాశాల ప్రాంగణంలో 144 సెక్షన్ వేయించామని పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రామారెడ్డి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించారు. 131 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 130 మంది విద్యార్థులు హాజరై, ఒకరు గైర్హాజరయ్యారు.

షబ్బీర్ అలీకి మంత్రి పదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ నాయకుల డిమాండ్

నవతెలంగాణ-దోమకొండ

1989లో మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నుకోబడి కాంగ్రెస్ పార్టీలో 33 సంవత్సరాల వయసులోనే మంత్రి పదవిగా పనిచేసి, అనంతరం తిరిగి 2004లో వైయస్ రాజశేఖర్ రెడ్డి హయంలో సైతం మంత్రిగా పనిచేసి, ప్రస్తుతం పార్టీలో చురుకైన పాత్ర పోషిస్తున్న ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీకి మంత్రి పదవిని కేటాయించాలని దోమకొండ కాంగ్రెస్ నాయకులు విజ్ఞప్తి చేశారు. గురువారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు తిరుమలగౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి, నాయకులు శంకర్ రెడ్డి, నర్సారెడ్డి, సీతారాం మధుసూదన్ మాట్లాడారు. షబ్బీర్ అలీ పార్టీకి ఎనలేని సేవ చేస్తూ పార్టీలో చురుకైన పాత్రను పోషిస్తున్నారని వివరించారు. కామారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల బాగోగులను చూసిన ఘనత ఆయనకే ఉందన్నారు. ప్రతిపక్షంలో కొనసాగినప్పటికీ కార్యకర్తల సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. కామారెడ్డి నియోజకవర్గం నుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోటీ చేసి ఓడిపోవడం దురదృష్టంగా భావిస్తున్నామని, దాంతో జిల్లాకు ఎలాంటి మంత్రి పదవి లేకపోవడంతో ఎలాంటి అభివృద్ధి పనులు జరగడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ నాయకులు స్పందించి షబ్బీర్ అలీకి మంత్రి పదవిని కేటాయించాలని దోమకొండ మండల కాంగ్రెస్ పార్టీ తరఫున విజ్ఞప్తి చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సంతోష్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాజు, ఎల్లంయాదవ్, సుధాకర్ యాదవ్, మల్లేష్ యాదవ్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

మండల సమైక్య అధ్యక్షురాలిగా గడ్డం సులోచన

నవతెలంగాణ-లింగంపేట్

లింగంపేట్ మండల సమైక్య అధ్యక్షురాలిగా మోతే గ్రామానికి చెందిన గడ్డం సులోచన రెండోసారి అధ్యక్షురాలిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. లింగంపేట్ మండల సమాఖ్య సమావేశాన్ని గురువారం అధ్యక్షురాలి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామ, మండల సమైక్య ఎన్నికల విధానం, కార్యక్రమాన్ని వివరించారు. మండల సమైక్య జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గ సభ్యులను, నూతన పదాధికారులను ఎన్నుకున్నారు. ఈ సమావేశానికి ఎన్నికల స్పెషల్ ఆఫీసర్ నాగిరెడ్డిపేట్ ఏపీఎం జగదీష్ కుమార్ హాజరై ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షురాలిగా గడ్డం సులోచన, కార్యదర్శిగా భీమవ్వ, పొల్కంపేట్ కోశాధికారి భాగ్యలక్ష్మి సజ్జనపల్లిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. వారి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం శ్రీనివాస్, సీసీలు మన్సూర్ నజీర్, శ్రావణ్, స్వప్న, మెహర్, అంజయ్య, గంగరాజు, రాజిరెడ్డి, అకౌంటెంట్ నరేందర్, అటెండర్ రవి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఎన్నికైన సభ్యులు

కస్తూర్బా విద్యార్థులకు పరీక్ష అట్టలు అందజేత

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నారెడ్డి స్వచ్ఛంద సంస్థ ద్వారా పరీక్ష అట్టలను, స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు నారెడ్డి మోహన్ రెడ్డి సూచన మేరకు పోతుల చిన్న భాస్కర్‌రెడ్డి, చింతకుంట కిషన్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డికి వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయిరాలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో గురువారం రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. గత ప్రభుత్వ హయాంలో ఈ రోడ్డు విస్తరణ పనులు మంజూరవగా.. గురువారం పనులు ప్రారంభం అవడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేయనున్నటు తెలిపారు.

ఇష్టంతో చదివితేనే ఉత్తమ ఫలితాలు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్



విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివితేనే ఉత్తమ ఫలితాలు సాధించే అవకాశం ఉందని పెద్దకొడప్‌గల్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల స్పష్టంచేశారు. గురువారం పదవ తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. క్రమశిక్షణ, అంకితభావం, పెద్దల పట్ల గౌరవం ఉన్న విద్యార్థులు తమ భవిష్యత్తును బంగారు బాటగా మార్చుకోవచ్చుని ఆమె సూచించారు. నీకున్న కొద్ది సమయాన్ని సద్వినియోగం చేసుకొని ప్రణాళికబద్ధంగా చదివితే ఉత్తమ ర్యాంకులు సాధించే అవకాశం ఉందని, చదువుతోపాటు క్రీడల్లో రాణించినప్పుడే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంతోష్‌రెడ్డి, పిఆర్టియు మండల ప్రధాన కార్యదర్శి కిషోర్, రాజు, రవి, ఉపాధ్యాయినీలు, విద్యార్థులు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

నవతెలంగాణ-దోమకొండ

అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై అనిల్ గురువారం తెలిపారు. పాల్వంచ మండలంలోని బండరామేశ్వర్‌పల్లి గ్రామంలోని వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా, అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకొని, ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మండలంలో ఎవరైనా అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

వాహనాలు తనిఖీ

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలోని 44వ జాతీయ రహదారిపై ఆదర్శ పాఠశాల సమీపంలో గురువారం వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. తనిఖీల్లో భాగంగా ఎస్సై రంజిత్ కుమార్ ద్విచక్ర వాహదారులకు ప్రత్యేకంగా ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రత్యేక ఇన్ఫోర్స్మెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంజిత్ రంజిత్ కుమార్‌తో పాటు పోలీసులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను చెల్లించాలి

నవతెలంగాణ-భిక్కనూర్



ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి అఖిల తెలిపారు. గురువారం గ్రామంలో ఇంటి పన్ను వసూలు కార్యక్రమాన్ని పంచాయతీ సిబ్బంది చేత చేపట్టారు. గ్రామంలో నీటి సమస్యను గుర్తించి సిబ్బంది చేత బోరు మోటర్ రిపేర్ చేయించారు. గ్రామ సమస్యలను పంచాయతీ కార్యాలయంలో తెలియజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని కార్యదర్శి సూచించారు.

ఏర్గట్ల ఛాయాచిత్రకారుడికి సన్మానం



నవతెలంగాణ-ఏర్గట్ల

ముంబైలోని జాంబురి మైదానంలో శ్రీ మలయాళ స్వామి భక్త సమాజం ఈ నెల 10,11,12 మూడు రోజుల పాటు నిర్వహించిన 99 వ సనాతన వేదాంత జ్ఞానసభల్లో ఏర్గట్ల మండలకేంద్రానికి చెందిన ఛాయా చిత్రకారుడు పిట్ల రాముకు వ్యాసాశ్రమ పీఠాధిపతులు పరిపూర్ణానందగిరి చేతుల మీదుగా సన్మానం జరిగింది. ఫోటోగ్రఫీలో విశేషమైన సేవలందించినందుగాను నాకు ఈ గౌరవం దక్కడం ఆనందంగా ఉందని పిట్ల రాము అన్నారు.

రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఓటరు జాబితా, ఎన్నికల నిర్వహణ తదితర వాటితో ముడిపడిన అంశాల గురించి చర్చించేందుకు వీలుగా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో క్రమం తప్పకుండా సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి.సుదర్శన్ సూచించారు. జిల్లా కలెక్టర్లు, ఈ.ఆర్.ఓలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ.ఆర్.ఓలు తమతమ స్థాయిలలో పొలిటికల్ పార్టీ మీటింగ్ లు ఏర్పాటు చేసి అప్ డేట్స్ అందించాలన్నారు. సమావేశాల తేదీ, సమయాన్ని ఖరారు చేస్తూ ముందస్తుగానే రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలియ జేయాలన్నారు. కాగా, ఓటరు జాబితా సవరణకు సంబంధించి కొత్తగా వచ్చిన దరఖాస్తులను వెంట దివెంట పరిశీలిస్తూ సకాలంలో పరిష్కరించాలని సీ.ఈ.ఓ సూచించారు. వీడియో కాన్ఫరెన్సులో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్, సాత్విక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కూలీకి చేతినిండా పని కల్పించడమే లక్ష్యం

- ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ప్రతి ఉపాధి కూలికి చేతినిండా పని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని నాగాపూర్ గ్రామంలో కొనసాగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను ఆయన పరిశీలించారు. కూలీల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించి, కూలీల హాజరు తీసుకున్నారు. ఉపాధి హామీ కూలీలతో మాట్లాడి పని ప్రదేశంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలకు ఇబ్బంది కలగకుండా వసతులు కల్పించాలని ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. ఉపాధి కూలీలకు గిట్టుబాటు అయ్యేలా పని కల్పించాలని ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్, తదితరులు ఉన్నారు.

శాంతినికేతన్ యూత్ ఆధ్వర్యంలో కామదహనం



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి శాంతినికేతన్ యూత్ ఆధ్వర్యంలో కామదహనం నిర్వహించినారు. ఈ సందర్భంగా పట్టణ టీసీ సెల్ అధ్యక్షులు దొండి రమణ మాట్లాడుతూ.. కామదహన కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందని, కామదాన రోజు మనిషిలోని అన్ని చెడు గుణాలను దహనం చేస్తూ ప్రేమ ఆప్యాయతలతో సుఖ సంతోషాలతో ప్రజలందరూ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో బారడ కిషోర్, కిరణ్, గణేష్, కాశీ బబ్బు, శాంతినికేతన్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కామ దహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గురువారం గ్రామాభివృద్ధి సభ్యులు హెూలీ పండుగను ఘనంగా నిర్వహించారు.

ఏర్గట్ల : మండలకేంద్రంలో కామదహనం కార్యక్రమాన్ని ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మొదటగా నిలువుగా కట్టెలు నిలిపి, పిడకలను కట్టెల మధ్య ఉంచి, చట్టూరా చిన్న పందిరి వేసి, దానికి పూల దండలతో అలంకరించి, హారతి అనంతరం కామదహనాన్ని నిర్వహించారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి ఒక్కరు కామదహణం లో పాల్గొన్నారు.

ముఖ్య నాయకులతో ఎంపీ సమావేశం

నవతెలంగాణ-ఆర్మూర్

జిల్లా పార్లమెంటు సభ్యులు ధర్మపురి అరవింద్ హైదరాబాదులో తన నివాసంలో గురువారం జిల్లా బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. తాజా రాజకీయ పరిణామాలు, అసెంబ్లీ సమావేశాలు, భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ధన్పాల్ సూర్యనారాయణ, పైడి రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, తదితరులు పాల్గొన్నారు.

హాకీ టోర్నమెంట్ ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ హాకీ అసోసియేషన్ ఆదేశాల మేరకు ఈనెల 16,17,18వ తేదీలలో కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌లో జరగబోయే రాష్ట్రస్థాయి అంతర్ జిల్లాల పురుషుల హాకీ టోర్నమెంట్‌కు జిల్లా జట్టు ఎంపికలు గురువారం పట్టణంలో నిర్వహించారు. ఎంపికైన జట్టు ఈనెల 15న మధ్యాహ్నం హుజరాబాద్‌కు బయలుదేరుతుందని జిల్లా హాకీ సంఘం ప్రధాన కార్యదర్శి సదమస్తుల రమణ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా హాకీ సంఘం అధ్యక్షులు విశాఖ గంగారెడ్డి మాట్లాడుతూ.. ఎంపికైన జట్టును అభినందిస్తూ, రాష్ట్రస్థాయిలో మన జిల్లాకు మొదటి స్థానం తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ యొక్క ఎంపిక ప్రక్రియను జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కొండ్రా అంజు, ఈసీ మెంబర్స్ సడక్ నాగేష్, సీనియర్ క్రీడాకారులు జిన్నా గంగాధర్, నర్సింగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా హెూలీ సంబరాలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం హెూలీ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు రంగులతో ఒకరి మీద ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందంగా హెూలీ పండుగ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ హెూలీ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. హెూలీ అంటే అగ్ని లేదా అగ్నితో పునీతమైనదని అర్థం అని తెలిపారు. హెూలీ పండుగ అంటే చిన్నారులకు, పెద్దలకు అందరికీ ఇష్టమైన పండుగని, ఈ పండగ సబండ వర్ణాలు అందరు కలిసి జరుపుకుంటారని అన్నారు. హెూలీ పండుగ కులాలకు, మతాలకు అతీతంగా జరుపుకునే పండుగా అని, చతుర్దశి నాడు కాముని దహనం జరిపి మరుసటిరోజు పాల్గుణ పౌర్ణమి రోజు హెూలీ పండుగను జరుపుకుంటారని గుర్తు చేశారు. హెూలీ పండుగను భారతదేశంలోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్ దేశాల్లో కూడా వైభవంగా జరుపుకుంటారని తెలిపారు. వసంత కాలంలో వచ్చే పండుగ కాబట్టి పూర్వం ఈ పండుగను 'వసంతోత్సవం' పేరిట జరుపుకునేవారని విద్యార్థులకు వివరించారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగల్లో ఇదీ ఒకటిని అన్నారు. సహజమైన రంగులతో హెూలీ పండుగను నిర్వహించుకోవాలని, కాలుష్యాన్ని నిర్మూలించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గిరిధర్, ఉపాధ్యాయులు మాసం శ్రీనివాస్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

తొలగించిన హెూర్డింగ్: ఏఐఎస్ఎఫ్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) అధ్వర్యంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి రఘురాం మాట్లాడుతూ. నిజామాబాద్ జిల్లా సమితి ఆధ్వర్యంలో నిజామాబాద్ రూరల్ మండలంలోని (భారతి గార్డెన్) మాధవ నగర్ దగ్గర నూతనంగా నిర్మాణం చేస్తున్న ప్రెసిడెన్సీ ఇంటర్నేషనల్ (ఆరావళి క్యాంపస్) స్కూల్ పేరుతో విద్యాశాఖ నుండి ఎటువంటి అనుమతులు లేకుండా అడ్మిషన్లు నిర్వహిస్తూ బిల్డింగ్ పూర్తి కాకముందే 50శాతం ఫీజులు వసూలు చేస్తున్నారని పోరాటాలు నిర్వహించామన్నారు. నిజామాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ స్పందిస్తూ ప్రెసిడెన్సీ ఇంటర్నేషనల్ (ఆరావళీ క్యాంపస్) స్కూల్ కు విద్యాశాఖ నుండి అనుమతి లేనందున నగరంలోని ప్రెసిడెన్సీ ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో వున్న విద్యాసంస్థల హోర్డింగ్ తొలగించాలని ఆదేశాలు జారీ చేశారన్నారు. ఆస్కూల్లో పిల్లలను చేర్పించి భవిష్యత్తును నాశనం చేసుకోకోవద్దని తల్లిదండ్రులను కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు సుభొద్, నవీన్ కృష్ణ, శివాజీ, వంశీ పాల్గొన్నారు.

గ్రామీణ నియోజకవర్గాల్లో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లు

- రాష్ట్ర ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్
- కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

యువతలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి కల్పన, శిక్షణ శాఖ ఆధ్వర్యంలో నూతనంగా గ్రామీణ నియోజకవర్గాలలో అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను (ఏటీసీ) ఏర్పాటు చేయాలని సంకల్పించిందని ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సంజయ్ కుమార్ వెల్లడించారు. గురువారం ఆయన జిల్లా కలెక్టర్లతో జూమ్ మీటింగ్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే రాష్ట్రంలో 70 ఏటీసీ కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. ఇదే తరహాలో ఐటిఐ, ఏటీసీ సెంటర్లు లేని ప్రతి గ్రామీణ ప్రాంత అసెంబ్లీ సెగ్మెంట్ లో కనీసం ఒకటి చొప్పున అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని ఏటీసీ సెంటర్ల నిర్మాణానికి అనువైన ప్రదేశం, స్థలాన్ని గుర్తిస్తూ సమగ్ర వివరాలతో కూడిన



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, అధికారులు

నివేదికలను త్వరితగతిన సమర్పించాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్రంలో సుమారు 45 ఏటీసీ కేంద్రాలను గ్రామీణ ప్రాంత నియోజకవర్గాలలో నెలకొల్పాలని ప్రభుత్వం నిర్దేశించిందని అన్నారు. రోడ్డు, రవాణా వసతితో పాటు సమీపంలో పరిశ్రమలు ఉన్న స్థలాలను ఎంపిక చేస్తే ఏటీసీ కేంద్రాలలో విద్యార్థులు ప్రవేశాలు పొందేందుకు, ఇన్ స్ట్రక్టర్లు సులువుగా రాకపోకలు సాగించేందుకు వీలుంటుందని సూచించారు. అంతేకాకుండా స్థానిక పరిశ్రమలకు చేరువలో ఏటీసీలను ఏర్పాటు చేసినట్లయితే, సంబంధిత పారిశ్రామిక అంశాలతో కూడిన ట్రేడ్లలో యువతకు శిక్షణ అందించేలా ప్రణాళికలు చేపట్టవచ్చని అన్నారు. తద్వారా శిక్షణ పూర్తి చేసుకున్న వెంటనే యువతకు స్థానిక పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు లభించేందుకు దోహదపడినట్లు అవుతుందన్నారు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుంటూ అనువైన ప్రదేశాలలో అందుబాటులో ఉన్న స్థలాల వివరాలతో కూడిన నివేదికలను వెంటనే పంపాలని ప్రిన్సిపల్ సెక్రెటరీ సూచించారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ.. జిల్లాలోని ఆర్మూర్, నిజామాబాద్ రూరల్ అసెంబ్లీ నియోజకవర్గాలలో ఏ.టీ.సీ కేంద్రాల ఏర్పాటుకు అందుబాటులో ఉన్న స్థలాలను గుర్తించి పూర్తి వివరాలతో కూడిన నివేదికను సోమవారం లోపు పంపిస్తామని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత, విత్తన శుద్ధి పరిశ్రమలకు అనుగుణంగా ఏటీసీ కేంద్రాలలో కోర్సులను ప్రవేశపెట్టేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. జూమ్ మీటింగ్ లో సంబంధిత శాఖల అధికారులు, ఐ.టి.ఐ కళాశాల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

మూత్రపిండాల సమస్యలు తలెత్తితే నిర్లక్ష్యం చేయొద్దు

- ప్రముఖ మూత్రపిండాల వైద్య నిపుణులు డాక్టర్ అజయ్ కుమార్, విశ్వంత్ పాటిల్

నవతెలంగాణ-కంఠేశ్వర్

ఇటీవల కాలంలో ఎక్కువగా దీర్ఘకాలిక మూత్రపిండా వ్యాధి భారిన పడుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, ఏదైనా చిన్నపాటి సమస్య తలెత్తిన నిర్లక్ష్యం వహించకుండా సంబంధిత వైద్యులను సంప్రదించాలని ప్రముఖ మూత్రపిండాల వైద్య నిపుణులు డాక్టర్ అజయ్ కుమార్ విశ్వంత్ పాటిల్ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎల్లమ్మ గుట్టలో గల మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ మూత్రపిండాల దినోత్సవాన్ని పురస్కరించుకొని మూత్రపిండ వ్యాధి బారిన పడ్డవారికి, రోగులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం రోజురోజుకు తీసుకునే ఆహారపు అలవాట్లు మధుమేహం, రక్తపోటు, అధికంగా పెయిన్ కిల్లర్ మందులు వాడడం, సరైన ఆహారం అలాగే నీటి శాతం తక్కువ తీసుకోవడం డిహైడ్రేషన్, ఇతర అనారోగ్య సమస్యలకు అధికంగా ఇష్టారీతిన వైద్యుల సలహాలు లేకుండా మందులు వాడడం వల్ల మూత్రపిండాల వ్యాధి బారిన పడుతున్నారని తెలిపారు. ఈ మూత్రపిండాల వ్యాధి బారిన పడితే డయాలసిస్ అనేది నిరంతరంగా చేయించుకోవడం జరుగుతుందన్నారు. కొన్ని సందర్భాల్లో ఎక్కువమంది మూత్రపిండాల వల్ల నిర్లక్ష్యం వహించడం ద్వారా ప్రాణాలు సైతం కోల్పోతున్నారని సూచించారు.

అనంతరం మెడికవర్ హాస్పిటల్ అసిస్టెంట్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కూరపాటి యజ్ఞ, డైటీషియన్ మెడికవర్ హాస్పిటల్ శ్రీలేఖ మాట్లాడుతూ.. శరీరంలో ప్రతి అవయవం కూడా చాలా ముఖ్యమైందని గుర్తు చేశారు. నేడు ప్రపంచ మూత్రపిండాల దినోత్సవం సందర్భంగా మూత్రపిండాల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే సదుద్దేశంతో మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం ప్రపంచ మూత్రపిండాల వ్యాధి దినోత్సవం పురస్కరించుకొని వైద్య నిపుణులు, సిబ్బంది వ్యాధిగ్రస్తులతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో మెడికవర్ హాస్పిటల్స్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ యజ్ఞ, యూరాలజిస్ట్ డాక్టర్ ఏ.సతీష్, మెడికవర్ హాస్పిటల్స్ సెంటర్ హెడ్ స్వామి, మార్కెటింగ్ మేనేజర్ వినయ్ కుమార్, మెడికవర్ హాస్పిటల్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యులు



పారిశుధ్య కార్మికుడు మృతి

- ఆర్థిక సహాయం అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చెందిన పారిశుధ్య కార్మికుడు శ్రీ లక్ష్మీనారాయణ అనారోగ్యంతో మృతిచెందగా, గురువారం మున్సిపల్ కమిషనర్ రాజు భౌతిక కాయానికి నివాళులర్పించి అంతిమ సంస్కారానికి పురపాలక సంఘం తరపున ఆర్థిక సాయం అందించడం జరిగింది. కార్యక్రమంలో సానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, జవాన్ బాబురావు, మున్సిపల్ సిబ్బంది, పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, బ్యాగులు పంపిణీ

నవతెలంగాణ-కంఠేశ్వర్

జిల్లా కేంద్రంలోని సారంగాపూర్‌లో ప్రభుత్వ పాఠశాలలో 300 మంది విద్యార్థులకు, ఉర్దూ హై స్కూల్‌లో 100 మంది విద్యార్థులకు తెలంగాణ జాగృతి యువజన విభాగం నాయకులు రెహాన్ ఆధ్వర్యంలో నోట్‌బుక్స్, స్కూల్ బ్యాగులు గురువారం పంపిణీ చేశారు. జాగృతి యువజన నాయకులు రేహాన్ మాట్లాడుతూ.. పది సంవత్సరాలుగా కవితక్క జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు లక్ష్మీనారాయణ భరద్వాజ్, గణపురం దేవేందర్, అమెర్, ఇస్మాయిల్, శ్యామల సాయి కృష్ణ, పంచరెడ్డి మురళి, హరీష్, తదితరులు పాల్గొన్నారు.

పిఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని సిద్దులగుట్ట నవనాథ సిద్దేశ్వర పిరమిడ్ ధ్యాన మహా శక్తి క్షేత్రం వద్ద 16న పిఎస్ఎస్ఎం నవనాథపురం కమిటీ 3వ వార్షికోత్సవ వేడుకలు, పిరమిడ్ సేవాదళ్ కార్యచరణ సదస్సు నిర్వహిస్తున్నట్టు పిఎస్ఎస్ఎం జిల్లా అధ్యక్షులు అడ్వకేట్ సాయి కృష్ణరెడ్డి గురువారం తెలిపారు. అందరూ ఉదయం 9 గంటల వరకు రావాలని, కార్యక్రమానికి జ్ఞాన దాతలుగా ఆత్మీయ అతిథు లుగా పిరమిడ్ సేవాదళ్ జాతీయ అధ్యక్షులు పరమేశ్వర్ రెడ్డి, జాతీయ కోఆర్డినేటర్ మాధవి, తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్ అధ్యక్షులు ధ్యాన గద్దర్ భూపతి రాజు వెంకటేశ్వరరావు, నాగేంద్ర ఇతర సీనియర్ పిరమిడ్ మాస్టర్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పిఎస్ఎస్ఎం జిల్లా ఉపాధ్యక్షులు మామిడి లక్ష్మారెడ్డి, ప్రధాన సలహాదారులు బొడ్డు దయానంద్ సభ్యులు మల్లారం సాయినాథ్, పోలీస్ గంగారెడ్డి సబ్బాని సుదర్శన్, తదితరులు పాల్గొన్నారు.

ఉప్లూర్ పాఠశాలలో

ఏఐ ఆధారిత బోధన

- ఈనెల 15 నుంచి ఏఐ ఆధారిత బోధన
- హర్షం వ్యక్తం చేసిన ఎంఈఓ ఆంధ్రయ్య

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఉప్లూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విద్య బోధనకు ఎంపికైంది. ఇక నుంచి పాఠశాలలో ఏఐ ఆధారిత బోధన జరగనున్నట్టు ప్రధానోపాధ్యాయులు కే.రాజన్న గురువారం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నటువంటి కార్యక్రమంలో భాగంగా ప్రతి మండలంలోని ఒక పాఠశాలలో ఏఐ ఆధారిత బోధన కొనసాగనుందని సూచించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విద్య బోధన ఈనెల 15 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఉప్లూర్ ప్రాథమిక పాఠశాల ఏఐ ఆధారిత విద్యాబోధన ఎంపిక కావడం పట్ల మండల విద్యాధికారి ఆంధ్రయ్య హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఆయన అభినందనలు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్లకు ముహూర్తం

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని సోంపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లకు గురువారం ఎంపిడిఓ చందర్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అర్హులైన, అనుమతి జాబితాలో ఉన్నవారందరూ నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

డిగ్రీ- రివాల్యుయేషన్ నోటిఫికేషన్ విడుదల

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని డిగ్రీ - సి బి సి ఎస్ . పరీక్షలకు రివాల్యుయేషన్ నోటిఫికేషన్‌ను గురువారం విడుదల చేశారు. డిగ్రీ, ఒకటవ, మూడవ, ఐదవ సెమిస్టర్ (రెగ్యులర్), రెండవ, నాల్గవ, ఆరవ సెమిస్టర్ బ్యాక్ లాగ్ థియరీ నవంబర్ డిసెంబర్-2024లో పరీక్షలకు హాజరైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోనుటకు అర్హులని పేర్కొన్నారు. ఒక్కో పేపర్‌కు 500 రూపాయలు రివాల్యుయేషన్ ఫామ్‌కు 25 రూపాయలు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. దరఖాస్తులు ఈనెల 20 వరకు చేసుకోవాలని పరీక్షల నియంత్రధికారి ప్రొఫెసర్ కే సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలు తెలంగాణ వర్సిటీ వెబ్సైట్లో పొందుపరిచినట్టు తెలిపారు.

ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్: భారత జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పుట్టిన రోజు సందర్భంగా గురువారం ఆమెకు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్ లోని ఆమె నివాసానికి వెళ్లి బర్త్ డే విషెస్‌ను జీవన్‌రెడ్డి తెలిపారు.

పట్టణంలోని పెర్కిట్‌లో..

బీఆర్ఎస్ పట్టణ శాఖ అధ్యక్షులు పూజ నరేందర్ ఆధ్వర్యంలో నియోజకవర్గ ఇంచార్జ్ రాజేశ్వర్‌రెడ్డి సూచనల మేరకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలు పట్టణంలోని పెర్కిట్‌లో కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించినారు. సీనియర్ నాయకులు నచ్చు చిన్నరెడ్డి, మీరా శ్రవణ్, మండల యువజన అధ్యక్షులు అగ్గు క్రాంతి, జన్నెపల్లి రంజిత, విజయ్, కపెల్లి గణేష్, బోగా గిరీష్, శైఫ్.హర్షద్, తదితరులు పాల్గొన్నారు.

కంఠేశ్వర్ : ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా పార్టీ నాయకులు రవికుమార్, సుజిత్ సింగ్ ఠాగూర్, ప్రభాకర్, విశాలిని రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే బిగాల





కంఠేశ్వర్: ఎమ్మెల్సీ కవితకు శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే బిగాల.. డిచ్‌పల్లి: ఎమ్మెల్సీకి పుష్పగుచ్ఛం అందజేత

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా హైదరాబాద్‌లోని తన నివాసంలో కలిసి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

స్నేహ సొసైటీలో పండ్లు, స్నాక్స్ పంపిణీ

కంఠేశ్వర్ : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జన్మదిన సందర్భంగా స్నేహ సొసైటీలో పండ్ల, స్నాక్స్ గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కవిత కార్యాలయంలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ జాగృతి నాయకులు అవంతి రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఆడపడుచు తెలంగాణ మహిళలోకానికి బతుకమ్మను ప్రపంచవ్యాప్తంగా విస్తరింపజేసిన ఘనత కవితక్కదేనని, నిజామాబాద్ పరిధిలోని ఎన్నో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే పేషెంట్ సహాయకులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దాదన్న విట్టల్ రావు, లక్ష్మీనారాయణ భరద్వాజ్, రహన్ హైమద్, పంచ రెడ్డి మురళి, శ్యామల సాయికృష్ణ, డాక్టర్ పులి జైపాల్, శోభవతి సరిత, తదితరులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కనులకుంట్ల కవితకు రాష్ట్ర మాజీ మంత్రి బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. హైదరబాద్‌లోని ఆమే నివాసంలో ఎమ్మెల్సీ కవితకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

డిచ్‌పల్లి : జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ను గురువారం నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల మాజీ ఐడీసీఎంఎస్ చైర్మన్ సాంబారి మోహన్ హైదరాబాద్ లో కలిసి జన్మదిన శుభాకాంక్షలు, హెూలీ శుభాకాంక్షలు తెలిపారు. పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు కృషి చేయాలని కవిత సూచించినట్లు వివరించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు విజయం సాధించే విధంగా చూడాలని కవిత సూచించారు. జిల్లా, మండలాల్లో ఉన్న స్థితి గతులను అడిగి తెలుసుకున్నాట్లు పేర్కొన్నారు.

నిజామాబాద్‌సిటీ : తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదినం సందర్భంగా నిజామాబాద్ నగరంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బీఆర్ఎస్‌వి జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఈ శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్సీ కవిత ఆయు ఆరోగ్యలతో ఉండాలని, మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి జిల్లా ప్రజలకు మరింత సేవచేయలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌వి నాయకులు గణేష్, శంకర్, నితిన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : ఉపాధి హామీ మహిళల మధ్య ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు వేడుకలు నిర్వహించినట్లు టిఆర్ఎస్ సీనియర్ యువ నాయకుడు చింత మహేష్ తెలిపారు. మండలంలోని పుప్పాలపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీల మధ్యన ఎమ్మెల్సీ కవిత పుట్టినరోజు సందర్భంగా మహిళలచే కేక్ కట్ చేయించి స్వీట్ తినిపించారు ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ నాయకులు ఉపాధి హామీ మహిళలు ఉన్నారు.

టీయూలో ఉపాధి హామీ పనులకు సహకరించండి

• ప్రత్యేక అధికారి యోహన్, ఎంపిడిఓ శ్రీనివాస్‌గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ చట్టంలో బాగంగా తెలంగాణ యూనివర్సిటీలో పలు పనులు చేపట్టడానికి సహకరించాలని తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ టి.యాదగిరి రావుకు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి మండల ప్రత్యేక అధికారి పల్నాటి యోహన్, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్ గౌడ్ కోరారు. యూనివర్సిటిలో ఉపాధి హామీ చట్టం కింద వాటర్ హార్వెస్టింగ్, పౌండ్స్, పిట్స్ ఇతర ఉపాధి హామీ పనులు చేయడానికి అనుమతించి సహకరించాలని తద్వారా ఉపాధి హామీ పని దినాలను సక్రమంగా వినియోగించుకొని క్షేత్రస్థాయిలో కార్మికుల సంఖ్యను పెంచుకోవడానికి సహాయపడాలని వారు కోరారు. సమావేశంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకులు, ఏపీఎం, ఈసీలు, పంచాయతీ సెక్రటరీ నిట్టు కిషన్ రావు తదితరులు పాల్గొన్నారు.

మొల్లమాంబ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

• కుమ్మర (శాలివాహన) సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

నవతెలంగాణ-కామారెడ్డి

కవయిత్రి మొల్లమాంబ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని కామారెడ్డి కుమ్మర (శాలివాహన) సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కుమ్మరి రాములు, డాకూరి మోహన్‌లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ముందు ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుమ్మరులకు ప్రతి రాజకీయ పార్టీ రాజకీయ అవకాశాలు కల్పించాలని, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి, కులవత్తిని అభివద్ధి చేసుకునేందుకు నిధులు విడుదల చేయాలన్నారు. స్థానిక ఎన్నికలలో కుమ్మరులకు ప్రతి రాజకీయ పార్టీ సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పిటిసిలకు స్థానాలను కేటాయించాలని తెలిపారు. కార్యక్రమంలో కుమ్మరి సత్తయ్య (రిటైర్డ్ టీచర్), డాకూరి ప్రవీణ్, కుమ్మరి యాదగిరి, కుమ్మరి కష్ణ (టీచర్), కుమ్మరి గోపాల్, కుమ్మరి లక్ష్మణ్, కుమ్మరి మధు, తదితరులు పాల్గొన్నారు.

రంగుల కేళి.. హోలీ

నవతెలంగాణ-విలేకరుల బృందం

జక్రాన్‌పల్లి : మండలంలోని వివేక్ నగర్ తండా వాసులు మండలకేంద్రంలో హెూలీ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. గతంలో వివేక్ నగర్‌తండా జక్రాన్‌పల్లి గ్రామంలో విలీనమై ఉండేది. గురువారం మాజీ వైస్ ఎంపీపీ జితేందర్ ఆధ్వర్యంలో హెూలీ పండుగలు జరుపుకున్నట్లు జితేందర్ తెలిపారు.

మోర్తాడ్ : మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో గురువారం హెూలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని చతురస్ర పాఠశాలలో విద్యార్థులు ఒకరిపై ఒకరు రంగు చల్లుకొని హెూలీ సంబరాలను నిర్వహించుకున్నారు. సహజ సిద్ధమైన రంగులను ఉపయోగించాలని, హానికరమైన రసాయనిక రంగులను వాడకూడదని విద్యార్థులకు పాఠశాల కరస్పాండెంట్ ఎస్ఎన్ గిరి తెలిపారు.

ఆర్మూర్: పట్టణంలోని క్షత్రియ ఇంజనీరింగ్ కళాశాలో హెూలీ పండుగను గురువారం ఘనంగా జరిపారు. ఈ ఉత్సవంలో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని రంగులతో ఒకరినొకరు అభినందించుకున్నారు. కళాశాల ప్రాంగణం హెూలీ రంగులతో కళకళలాడింది. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అల్జాపూర్ దేవేందర్ మాట్లాడుతూ.. "హెూలీ పండుగ భారతీయ సంస్కృతికి ప్రతిబింబమే కాకుండా, మన మధ్య స్నేహం, ఐక్యతను పెంపొందించే వేడుక అని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని అన్నారు.



నిజామాబాద్‌సిటీ : ఫ్యూచర్‌లైన్ స్కూల్లో

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్. కె. పాండే మాట్లాడుతూ.. ఇలాంటి సంబరాలు విద్యార్థులకు ఒత్తిడిని తొలగించేందుకు, వారిలో ఉత్సాహాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయన్నారు. అందరూ కలిసిమెలిసి ఈ వేడుకను జరుపుకోవడం ఆనందదాయకం అని అన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ: ఫ్యూచర్ లైన్ స్కూల్లో హెూలీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ ప్రియాంక, స్వప్న



నందిపేట్ : సూర్యోదయ స్కూల్లో

మాట్లాడుతూ.. విద్యార్థులు రంగులు చల్లుకుని ఆనందంగా గడిపారు. హెూలీ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు నృత్యాలు చేస్తూ పండు గను జరుపుకున్నారు. ఉపాధ్యాయి నులు గౌతమి, లావణ్య, శ్రీ లత, సంధ్య రాణి, సునిత, విద్యార్థులు పాల్గొన్నార

సూర్యోదయ స్కూల్‌లో..

నందిపేట్: మండలంలోని నందిపేట్‌లో గల శ్రీ సూర్యోదయ హై స్కూల్‌లో ఘనంగా హోలీ సంబురాలు గురువారం నిర్వహించారు. పిల్లలు ఆనందంగా కేరింతలు కొడుతూ రంగులు చల్లుకున్నారు. ఇందులో భాగంగా స్కూల్ కరస్పాండెంట్ చంద్రకళ, ప్రదానోపాధ్యాయులు నాగరావు, శిరీష, రంజిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని శ్రీ విద్యా సాయి ఉన్నత పాఠశాలలో రంగుల పండుగ హెూలీ వేడుకలు పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రంగులు చల్లుకుంటూ విద్యార్థులు కేరింతలు కొట్టారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

• పదిమంది పేకాటరాయుళ్ల అరెస్ట్

• పది సెల్ ఫోన్లు, 66410 నగదు స్వాధీనం

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో పేకాట స్థావరంపై దాడి చేసి పదిమంది పేకాటరాయలను 10 సెల్ ఫోన్లను 66,410 నగదును స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్ ఫోర్స్ సిఐ అంజయ్య గురువారం తెలిపారు. టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ ఏసీపీ నాగేంద్ర చారి ఆధ్వర్యంలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య స్పెషల్ పార్టీ సిబ్బంది వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వీక్లీ బజార్, ముదిరాజ్ గల్లిలో ఇంట్లో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై రైడ్ చేసి 10మంది పేకాటరాయళ్లు, 10సెల్ ఫోన్స్, నగదు 66,410 స్వాధీనం చేసుకొని తదుపరి చర్య నిమిత్తం వన్ టౌన్ ఎస్‌హెచ్ఓకు అప్పగించినట్లు తెలిపారు.

వాహనాల తనిఖీ

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ వాహనాల తనిఖీని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనదారులు హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని సూచించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న వారికి జరిమానా విధించారు. ఫోర్ వీలర్ వాహనదారులు సీట్ బెల్టు ధరించాలని, లైసెన్స్ లేకుండా వాహనం నడపకూడదని, లేనిచో చర్యలు తప్పవని హెచ్చరించారు.

మార్కెట్ కమిటీ అభివృద్ధే పాలకవర్గ లక్ష్యం

• ఏఎంసీ చైర్మన్ సౌజన్య రమేష్

నవతెలంగాణ-మద్నూర్

సహకారం మార్కెట్ కమిటీ అభివృద్ధి పరచడమే పాలకవర్గ ఉద్దేశమని ఏఎంసీ చైర్మన్ సౌజన్య రమేష్ అన్నారు. గురువారం ఉమ్మడి జిల్లాలోనే పత్తి పంట కొనుగోళ్లలో ప్రఖ్యాత గాంచిన మద్నూర్ మార్కెట్ కమిటీ పాలకవర్గ సాధారణ సమావేశం ఏఎంసీ చైర్మన్ సౌజన్య రమేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ.. మద్నూర్ మార్కెట్ కమిటీ ఆదాయంపై చర్చించినట్లు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, పాలకవర్గం సభ్యులు ఇన్చార్జి సెక్రెటరీ శ్రీకాంత్, ఏఎంసి కార్యాలయ సూపర్‌వైజర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షకు 651మంది విద్యార్థులు ఆబ్సెంట్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఇంటర్మీడియట్ పరీక్షలు గురువారం మొదటి సంవత్సరం మ్యాథ్స్ 1 బీ, హిస్టరీ, జూవలజి పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా ఇంటర్ విద్య అధికారి తిరుమలపుడి రవికుమార్ తెలియజేశారు. మొత్తం 651 మంది విద్యార్థులు ఆబ్సెంట్ అయ్యారని తెలిపారు. జిల్లాలో మొత్తం 18,197మంది విద్యార్థులకు గాను 17,546 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారని తెలియజేశారు. మొత్తం 96.4 శాతం విద్యార్థులు పరీక్షలు రాయగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలు నిర్వహించామని తెలియజేశారు. జిల్లాలో మొత్తం 57 పరీక్ష కేంద్రాలకు గాను 53 పరీక్ష కేంద్రాలను తనిఖీలు చేశారు. జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపూడి రవికుమార్ నిజామాబాద్ పట్టణంలోని వెక్టార్ జూనియర్ కళాశాల, నిజామాబాద్ పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను, జూనియర్ కళాశాల, రెండు ఎస్ ఆర్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను, అల్ఫోర్స్ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసి సమీక్షించారు.

18న జరిగే యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

యుజిసి నూతన ముసాయిదా - 2025ను వెంటనే రద్దు చేయాలని, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తిని కాపాడుకుందామని, విద్యారంగ సమస్యల పరిష్కారం, విద్యార్థుల హక్కుల సాధనకు ఉద్యమించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18న కాకతీయ యూనివర్సిటీలో జరిగే యూనివర్సిటీ విద్యార్థుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని పీడీఎస్‌యు నాయకులు కోరారు. రాష్ట్ర సదస్సు కరపత్రాలను గురువారం తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ముందు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిడి ఎస్ యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ ఈ సదస్సుకు విద్యార్థులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పిడిఎస్యు విద్యార్థి నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ కృషితో నవోదయ పాఠశాలల ఏర్పాటుకు అనుమతి

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షులు వంశీ గౌడ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి కృషితో కేంద్ర ప్రభుత్వం నిజాంబాద్ పార్లమెంటు పరిధిలో రెండు నవోదయ పాఠశాలల ఏర్పాటుకు అనుమతించిందని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ గౌడ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు సమాన దూరంలో ఉన్న కలిగోట్ గ్రామంలోని ప్రభుత్వ భూమిని ఎంపీ అరవింద్ ధర్మపురి ప్రతిపాదించారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే భూపతి రెడ్డికి , సీఎం రేవంత్ రెడ్డికి వివరించి ఏర్పాటుకు సహకరించాలని కోరారు. బోధన్ ఎమ్మెల్యే శ్రీ సుదర్శన్ రెడ్డి నవోదయను బోధన్‌లో ఏర్పాటు చేయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అక్కడి షుగర్ ఫ్యాక్టరీ భూములు ప్రైవేట్ కావడంతో, ఆ లొకేషన్‌పై నిర్ణయం తీసుకోవడానికి అదనంగా ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉందని తెలిపారు. ఆలస్యమైతే నవోదయ పాఠశాల ప్రాజెక్టు రద్దయ్యే ప్రమాదం కూడా ఉందని, అందుకే ఎంపీ లేఖల ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి విషయం తీసుకెళ్లారని పేర్కొన్నారు. బోధన్‌లో ఇప్పటికే అనేక విద్యాసంస్థలు, కేంద్రీయ విద్యాలయం ఉన్నందున, నవోదయ పాఠశాల నిజామాబాద్ రూరల్‌లో ఏర్పాటయితే మిగిలిన వెనుకబడిన ప్రాంతాలకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు. ఇది ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలను సృష్టించి ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల నిజామాబాద్ రూరల్ ప్రాంతానికి వచ్చిన ట్రిబుల్ ఐటీని బాసరకి తరలించారని ఆరోపించారు.

రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాదిగలపై కపట ప్రేమ చూపుతుంది : ఎంఆర్‌పీఎస్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత చేయకుండా ఉద్యోగాల ఫలితాలను విడుదల చేయడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్ డిచ్ పల్లి మండల ఇన్చార్జి నర్సయ్య అధ్యక్షతన తెలంగాణ తల్లి విగ్రహం వద్ద గురువారం రిలే దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షకు ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గంధమల నాగభూషణం మాదిగ పాల్గొని మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగిన మాదిగల మీద కాంగ్రెస్ ప్రభుత్వం కపట ప్రేమ చూపుతోందని, అసెంబ్లీ సాక్షిగా సిఎం రేవంత్ రెడ్డి మాదిగల ఇచ్చినటువంటి హామీని మరచి గ్రూప్స్ ఫలితాలను ప్రకటించడం అందులో వర్గీకరణను అమలు చేయకపోవడం మాదిగ నిరుద్యోగులను నిరాశకు గురిచేసిందని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం గ్రూప్1, గ్రూప్ 2,గ్రూప్ 3 ఫలితాలను తక్షణమే విరమించుకుని ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన తర్వాతనే అన్ని ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను చేపట్టాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ చట్టబద్ధత చేయకుండా ఉద్యోగ నియామకాలు చేపడితే కాంగ్రెస్ ప్రభుత్వంపై మాదిగల తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మోపాల్ మండల ఇన్చార్జి సంఘం కిష్టయ్య మాదిగ, ధర్పల్లి ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి నక్క రాజేందర్ మాదిగ, సిరికొండ ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మొట్టల దీపక్ మాదిగ, ఎమ్మార్పీఎస్ ఇందల్వాయి మండల నాయకులు చెడు మహేందర్ మాదిగ, డిచ్పల్లి ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గరిక సాయికుమార్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని దేవాయిపల్లి గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసినట్టు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి గురువారం తెలిపారు. పైడి వెంకటరెడ్డి అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ఇంటికి వచ్చాడని, ఆర్థిక ఇబ్బందులు కలగొద్దని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు రూ.60వేల విలువ గల చెక్కును బాధితుడికి అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షులు కమ్మరి నరేష్, సతీష్, శశికాంత్‌రెడ్డి, చిట్యారి మోహన్, సంజీవులు, కార్యకర్తలు, ఉన్నారు.

శనగ కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-గాంధారి



మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్వర్యంలో మార్కెట్ కమిటీ అవరణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా డిసిసిబి, డీసీఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయికు మార్, ఎఎంసి చైర్మన్ బండారి పరమేశ్వర్, స్థానిక నాయకులతో కలిసి శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గాంధారి మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు తూర్పు రాజులు, సొసైటీ వైస్ చైర్మన్ ఉదల్ సింగ్, డైరెక్టర్లు ధోల్లు సాయిలు, తాడ్వాయి సంతోష్ కుమార్, గోవింద్ గణపతిరావు, సొసైటీ సీఈఓ గాండ్ల సాయిలు, మండల వ్యవసాధికారి రాజలింగం, ఏఇఓలు, రైతులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

శానిటేషన్ పనులు పకడ్బందీగా చేపట్టాలి

ఎంపీడీవో శ్రీనివాస్

నవతెలంగాణ-జుక్కల్

శానిటేషన్ పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని శానిటేషన్, రాష్ట్ర ఉపాధి పనుల్లో చేపడుతున్న ఫాంఫండ్ పనులను ఎంపీడీవో గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కడైనా చెత్తాచెదారం కనిపించకుండా వెంటనే అక్కడి నుంచి తొలగించాలని దానిని కంపోస్ట్ షెడ్‌కు తరలించి తడి, పొడి చెత్తను వేరు చేయాలని పేర్కొన్నారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా ముందస్తుగా గుర్తించి పనులను చేపట్టాలని, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తమ వంతు కృషి చేయాలని జిపి సెక్రెటరీ ఆదేశించారు.

సాటాపూర్‌లో ఇంటి పన్ను వసూళ్లు

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని సాటాపూర్ గ్రామంలో ఇంటి పన్నుల వసూళ్లను గ్రామ కార్యదర్శి మహబూబ్ అలీ ఆధ్వర్యంలో రూ.7000 వసూలయ్యాయని ఆయన పేర్కొన్నారు. మార్చి చివరిలోపు 100శాతం ఇంటి పన్నుల వసూలు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు పన్నుల వసూలు చేస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట జూనియర్ అసిస్టెంట్ అశోక్ కుమార్, కారోబార్ మంగురాం, తదితరులు పాల్గొన్నారు.

ఎగ్జామ్స్ అంటే భయం వద్దు...

ప్రణాళికతో చదివితే అద్భుత ఫలితాలు

• ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్

• 10వ తరగతి విద్యార్థులకు మోటివేషన్ క్లాస్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని కోనా సమందర్ ప్రభుత్వ పాఠశాలలో వినూత్న కార్యక్రమం నిర్వహించారు. ఈమధ్య రాష్ట్ర ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల పేరుతో ఐకెపి మహిళలతో అన్ని పాఠశాలలో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసిన సంగతి విధితమే. ఈ క్రమంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న ఈ తరుణంలో పరీక్షలు అంటే భయం పోగొట్టి వారిలో ఉత్సాహాన్ని నింపుతూ కోనసముందర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఐకెపి ఉద్యోగ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు, స్థానిక ఐకెపి ఎపిఎం కుంట గంగాధర్ రెడ్డి చే ప్రత్యేక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్మెంట్ పరీక్షలు, ఆఫ్ ఇయర్లీ , ప్రీ ఫైనల్, క్వార్టర్ ఫైనల్ వంటి పరీక్షల పేరుతో ఇదివరకే పదవ తరగతిలో 9 రకాల పరీక్షలను విద్యార్థులు ఎదుర్కొన్నారని, ఇది కేవలం ఆ తదుపరి నిర్వహించే మరో పరీక్ష మాత్రమేనని విద్యార్థులకు గుర్తు చేశారు. పరీక్షలు అంటే భయాన్ని ప్రతి ఒక్కరు వదులుకోవాలని, సిలబస్‌లో ఉన్న అంశాలపై మాత్రమే ప్రశ్నలు వస్తాయని అలాంటప్పుడు భయపడడంలో అర్థం లేదన్నారు. పరీక్షలపై అవగాహన కోసం గత సంవత్సరం అంతకు ముందు సంవత్సరం నిర్వహించిన పబ్లిక్ పరీక్షల యొక్క పేపర్లను మోడల్ పేపర్లుగా పరిశీలించాలని వాటిని చూస్తే పూర్తి అవగాహన వస్తుందని వెల్లడించారు. ఈ పది రోజులు సాత్వికమైన ఆహారం భుజించాలని ఫాస్ట్ ఫుడ్, జంక్ ఫుడ్ లకు దూరంగా ఉండాలని, మాంసాహారం తినకపోవడం మంచిదన్నారు. తద్వారా ఆరోగ్యం మనసు రెండు అదుపులో ఉంటాయని తెలిపారు. ఎగ్జామ్స్ పేరుతో రాత్రింబవళ్లు చదవడం సరికాదని, కనీసం 6 నుంచి 7 గంటల నిద్ర కచ్చితంగా ఉండాలని అప్పుడే మనసు ఉత్సాహంగా ఉండి చదివింది అంతా గుర్తుంటుందన్నారు. పరీక్ష ప్రారంభం అవ్వగానే హడావుడి పడకుండా ప్రశ్నాపత్రాన్ని పూర్తిగా చదవాలని, అందులో 100 శాతం ఆన్సర్ వచ్చిన ప్రశ్నకి ముందుగా జవాబు రాయాలని ఆన్సర్ పేపర్లో మార్జిన్స్ వదిలేసి జవాబులను విడివిడిగా అక్షరాలను చాలా స్పష్టంగా రాయాలని, దీంతో పేపర్లను దిద్దే వారికి స్పష్టత ఉంటుందని మంచి మార్కులు వచ్చే అవకాశం ఉంటుందని అన్నారు. సెల్ఫోన్లకు టీవీలకు దూరంగా ఉండాలని కేవలం పరీక్షలపై మాత్రమే దృష్టి సారించి చక్కగా చదువుకొని మంచి ఫలితాలను సాధించాలన్నారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఏపీఎం కుంట గంగాధర్ రెడ్డిని ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మధుపాల్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పాలకవర్గ సభ్యులు నస్రీన్, రాజేశ్వరి, పదవ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు.

తెలంగాణ యూనివర్సిటీకి ఈశ్వరీ బాయి పేరు పెట్టాలి

అంసా రాష్ట్ర అధ్యక్షులు అంగరి ప్రదీప్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

నిజామాబాద్ జిల్లాలోని తెలంగాణ విశ్వవిద్యాలయానికి తెలంగాణ పోరాట యోధురాలు జె. ఈశ్వరీ బాయి పేరు పెట్టి "ఈశ్వరీ బాయి తెలంగాణ విశ్వవిద్యాలయం" గా మార్చాలని విజ్ఞప్తి చేస్తూ ఆల్ మాల్ స్టూడెంట్స్ అసోసియేషన్ (అంసా), ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం, సమత వలంటీర్ ఫోర్స్, సంఘాల ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ప్రొ. యాదగిరిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అంసా రాష్ట్ర అధ్యక్షుడు అంగరి ప్రదీప్ మాట్లాడుతూ "ఈశ్వరీ బాయి గొప్పతనాన్ని గుర్తించి తెలంగాణ విశ్వవిద్యాలయానికి ఆమె పేరు పెట్టాలనే ప్రతిపాదన తీసుకొచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. తొలితరం తెలంగాణ ఉద్యమకారిణిగా బాబాసాహెబ్ డా.బి.ఆర్.అంబేద్కర్, మహాత్మా జ్యోతీరావు పూలేల అడుగుజాడల్లో నడుస్తూ దళితులు,బడుగు బలహీన వర్గాలు మహిళలు, కార్మికులు, రైతులు, దినసరి కూలీలు, సబ్బండ వర్గాల హక్కులు, అవకాశాలు, ఆత్మగౌరవం కోసం అవిశ్రాంతంగా పోరాడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎల్లారెడ్డి నియోజకవర్గం నుండి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన గొప్ప మహిళ ఈశ్వరీ బాయి అని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ ఉన్నత విద్యామండలి, తెలంగాణ విశ్వవిద్యాలయం తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని " ఈశ్వరి బాయికి తగిన గుర్తింపును ఇచ్చి గౌరవించాలన్నారు. కార్యక్రమంలో సీసీ బ్యాంక్ డైరెక్టర్ గోర్కంటి లింగన్న, కిరణ్ అనుపాల్, తర్ల లక్ష్మణ్, భార్గవ్, దినకర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెపాటి మాధవరావు పుస్తక పరిచయ సభను జయప్రదం చేయండి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఈనెల 15న జరిగే గొర్రెపాటి మాధవరావు పుస్తక పరిచయ సభను జయప్రదం చేయాలని జంపాల చంద్రశేఖర్ ప్రసాద్ మెమోరియల్ ట్రస్ట్ ట్రస్టీ, రిటైర్డ్ న్యాయమూర్తి వై.కృష్ణగోపాల్ రావు అన్నారు ఈ సందర్భంగా ఎల్లమ్మ గుట్టలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గొర్రెపాటి మాధవరావు తన జీవితాంతం మానవ హక్కుల కోసం, బూటకపు ఎన్కౌంటర్లకు వ్యతిరేకంగా పోరాడారని, బాధితులకు కోర్టుల్లో కేసులు వేసి నష్టపరిహారం ఇప్పించారని తెలిపారు. మాధవరావు తన జీవితాంతం పీడిత ప్రజల కోసం, నిర్వాసితుల కోసం, ఆదివాసీల కోసం పోరాడారని చెప్పారు, ఎక్కడ హక్కుల హననం జరిగితే అక్కడ మాధవరావు ఉండేవారని, హక్కుల ఉల్లంఘనకు వ్యతిరేకంగా పోరాటాలు చేసే వారని తెలిపారు. మానవ హక్కుల సంఘం మాజీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉంటూ అనేక అంశాల మీద పుస్తకాలు రాసి, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహించి ప్రజలను చైతన్యవంతం చేశారని చెప్పారు. నిజామాబాద్ జిల్లాలో జరిగిన మూడు బూటకపు ఎన్కౌంటర్లకు వ్యతిరేకంగా కోర్టులో కేసులు నమోదు చేసి బాధితులకి నష్టపరిహారం కోసం పోరాడి విజయం సాధించారని, పేదలకు ఇండ్ల పట్టాల కోసం, న్యాయస్థానాల్లో పోరాడి విజయం సాధించారని చెప్పారు. ఈనెల 15న జంపాల మెమోరియల్ ట్రస్ట్‌లో నిర్వహించే గొర్రెపాటి మాధవరావు పుస్తక పరిచయ సభలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సీనియర్ అడ్వకేట్ పరుచూరి శ్రీధర్, అడ్వకేట్ గొంట్యాల రమేష్ , గంగన్ అన్వేష్ ,పవన్ ప్రసాద్ ,మరియు మాధవరావు కూతురు మధుమిత తదితరులు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

This is to inform the general public, Banks and all financial institutions, that **Sri Pendiyala Venkata Durgam S/o. Pendiyala Babu rao** aged: (52) Years, Occ: Agriculture, R/o H. No. 5-131, Jalalpur Village, Varni Mandal, District Nizamabad who lost a registered link document Nos.2082/2005, Dated: 30-08-2005, 1835/2005, Dated: 02-07-2005, SRO: Banswada pertaining to the Schedule Property "The Dry/Wet Agricultural land bearing Survey Nos. 38/అ/1 an extent Ac. (1-02 1/2) guntas 38/ఈ an extent Ac. (0-12) guntas, 38/ఉ an extent Ac. (0-06) guntas, 38/అ1 an extent Ac. (1-39 1/2) guntas or total extent Ac. (3-20) guntas, Situated at Jakora Village Shivar, Varni Mandal, Nizamabad District, within the Gramapanchayath limits of Jakora Village, Registration Sub-District Banswada, Registration District Nizamabad" he approached my client bank BANK OF INDIA, Branch Nizamabad to avail Dairy Loan facility by creating a equitable Mortgage in respect of above said Schedule Property. Any person, Bank, any financial institutions claiming any interest or title in the Property or otherwise having any objection can make representation to me directly or to the below mentioned address within Seven **(7) days** from the Publication of this Notice.

Date: 13-03-2025.
Nizamabad.

R. Sri Rama Goud,
#3-3-276,Padma Nagar Road No.4,Phulong-Varni Road,Besides Chaitanya Public School,Nizamabad,
Cell No. 9440415406.

IN THE COURT OF THE HONORABLE JUNIOR CIVIL JUDGE AT: NIZAMABAD
O.S.No. 340 OF 2024

Between:-
Sri. Gattavali Ramulu S/o Sayanna age 65 years occ: Agriculture R/o Dichpally village and Mandal Dist. Nizamabad.
..Plaintiff

And

Sri. Venishetty Ramana s/o Balaiah aged about 57 years occ: agriculture R/o Devunipally village Kamareddy Mandal and Dist.
..Defendant.

To,
Sri. Venishetty Ramana s/o Balaiah aged about 57 years occ: agriculture R/o Devunipally village Kamareddy Mandal and Dist.

Where as above named plaintiff has instituted suit against you for recovery of amount you are hereby summoned to appear in this court in person or by Pleader duly instructed and able to answer all material question relating to the suit or who shall be accompanied by some other persons able to answer all such questions on the **3rd day of April 2025 at 10.30'oclock** in the forenoon to answer the claim and you are directed to produce on that day all documents on which you lead to rely in support of your defense.

Take notice that in default of your appearance on the day above mentioned the suit will be determined in your absence.

// BY THE ORDER OF THE COURT //
Sd/-
J.Venkateshwar B.com.LLM. And N.Santosh M.Shyam Babu
Advocates
H.No 6-14-32Namdevwada, Nizamabad
Call: 9866228425.

PUBLIC NOTICE

This is to inform the General public, Banks and all financial institutions that one **Sri Doritula Srinivas S/o Pandari,** who approached my client Bank Hero Housing Finance Limited, Nizamabad Branch for availing **MORTGAGE LOAN** facility by producing a Registered Gift (Settlement) Deed Doc. No. 10176/2018, Dated: 15-11-2018 from his Donor Smt. Dontula Rama W/o Dontula Srinivas, and the said property originally purchased by Donor Smt. Donthula Rama, under Registered Sale Deed Doc. No: 4602/2005, Dated: 21-04-2005(ie, Link Document), with the below mentioned Schedule Property with boundariesSchedule of Property The Open Plot No. (4), lies in Survey No. 754, Situated at THIRMANPALLY H/o INDALWAI VILLAGE (Near Beside Bus Stand), Mandal Dichpally (Now Mandal Indalwai), District Nizamabad, admeasuring (96.44) Sq. Yards or (80.63) Sq. Meters, within the Grampanchayath limits of Thirmanpally Village, Registration Sub-District Nizamabad Rural and Registration District Nizamabadas bounded byNorth: 15-0" Wide RoadSouth: RTC Bus StandEast: Plot No (5)West: Plot No. (3)The above said Link Document of Registered Sale Deed No. 4602/2005, Dated: 21-04-2005 to the above said schedule property, which was lost in the hands of the present applicant/borrower Sri Dontula Srinivas S/o Pandari.Hence, the General Public, Banks and financial institutions hereby informed that, whoever, having any objections, claims, rights or any sort of right/objections over the said schedule property covered by the above said document, they may write, or submit along with documentary proof in support of the same to the undersigned within **(07) days** from the date of publication of this notice, else subsequent claims cannot be entertained.

Date: 13-03-2025.
Nizamabad.

R. Sri Rama Goud,
Advocate,
#3-3-198, Maisamma Street, Kotagalli Nizamabad.
Cell No. 9440415406